నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
1
ఆదిలాబాద్
గురువారం | మే 09, 2024 | www.navatelangana.com

ఆస్ట్రేలియాలో ప్రముఖ వ్యాపారి మృతి

నవతెలంగాణ-ఇంద్రవెల్లి

సప్త సముద్రాలు దాటి కన్న కొడుకును చూడాలని, అక్కడ కొన్ని రోజులు గడపాలని ఆస్ట్రేలియా వెళ్లిన ప్రముఖ వ్యాపారి జొన్నల కిషోర్(60) అనారోగ్యంతో మంగళవారం రాత్రి మరణించినట్లు బంధువులు తెలిపారు. అందరితో కలిసిమెలిసి ఉండే వ్యాపారి ఇటీవల మండల కేంద్రంలో జరిగిన హనుమాన్ మందిరం ప్రారంభోత్సవంలో ఉత్సాహంగా పాల్గొన్నాడు. ఈ నెల 3న ఆస్ట్రేలియాలోని ఆడిలైడ్ ఉన్న కొడుకు సందీప్ జొన్నవార్ వద్దకు వెళ్లాడు. వెళ్లిన నాలుగు రోజులకే అనారోగ్యంతో మృతి చెందాడు. ముగ్గురు కొడుకుల్లో రెండవ కుమారుడు ఆస్ట్రేలియాలో ఉంటున్నాడు. మిగత ఇద్దరు స్థానికంగా వ్యాపారం చూసుకుంటున్నారు. కిషోర్ మృతితో కుటుంబంతో పాటు వ్యాపార వర్గాల్లో విషాద ఛాయలు అలుముకున్నాయి.



వడదెబ్బతో వృద్ధుడి మృతి

నవతెలంగాణ-నేరడిగొండ

మండలంలోని వడూర్ గ్రామంలో కందూరి రాములు(60) వడదెబ్బతో బుధవారం మృతి చెందాడు. తెలిసిన వివరాల ప్రకారం..రాములు కొన్ని సంవత్సరాల క్రితం నిర్మల్ జిల్లా చించోలి గ్రామానికి వెళ్లి అక్కడే నివసిస్తున్నాడు. అప్పుడప్పుడు పొలం పనుల నిమిత్తం వడూర్‌కు వచ్చి పోతుంటాడు. బుధవారం అలాగే పొలం పనుల కోసం వచ్చాడు. పొలానికెళ్లగా ఎండ ఎక్కువగా ఉన్నందున వడదెబ్బకు గురయ్యాడు. గ్రామంలో టెంట్ హౌజ్ షాప్ పక్కన సేద తీర్చుకోవడానికి వెళ్లి స్పృహ కోల్పోయి అక్కడికక్కడే మృతి చెందాడు.



అభ్యర్థుల గెలుపు..నాయకులకు సవాల్..!

- అభ్యర్థుల విజయానికి చెమటోడుస్తున్న నాయకులు
- ఎంపీ స్థానం దక్కించుకునేందుకు వ్యూహాలు
- క్షణం తీరికలేకుండా ప్రచారంలో నిమగ్నం
- ఓటర్లను తమవైపు తిప్పుకునేందుకు ప్రణాళికలు

ఆదిలాబాద్ లోక్‌సభ అభ్యర్థుల గెలుపు..ఆయ పార్టీలకే కాదు..అందులోని కీలక నాయకులకు సవాల్‌గా మారింది. అభ్యర్థులు ఎవరున్నా..వారిని గెలిపించే బాధ్యతలు మాత్రం వీరు తీసుకోవడం ఆసక్తి రేపుతోంది. ఇందుకు ఆయా పార్టీల అధిష్టానాలు సైతం ఆయా పార్టీలకు చెందిన కీలక నాయకులకే గెలుపు బాధ్యతలు అప్పగించడం ప్రాధాన్యం సంతరించుకుంది. అభ్యర్థుల మాదిరిగా ప్రచారపర్వంలో వారు నిమగ్నమైన తీరు చూస్తుంటే ఓ దశలో ఎన్నికల్లో వారే పోటీ చేస్తున్నారా..? అనే రీతిలో కనిపించడం ఇందుకు నిదర్శనకంగా కనిపిస్తోంది. ఇప్పటికే అభ్యర్థుల తరపున ప్రచారానికి ఆయా పార్టీల అగ్రనేతలు రావడం ప్రచారపర్వాన్ని హీటెక్కించగా.. ఆయా పార్టీలకు చెందిన కీలక నాయకులు క్షణం తీరికలేకుండా అభ్యర్థుల గెలుపునకు చమటోడుస్తుండటం ఆసక్తి రేపుతోంది. గెలుపును ప్రతిష్టాత్మకంగా తీసుకుంటున్న సదరు నాయకులు ఉదయం నుంచి రాత్రి వరకు ప్రచారపర్వంలోనే నిమగ్నం కావడం ఆసక్తి రేపుతోంది. వివిధ సంఘాలు, సామాజికవర్గాల వారిని కూడగట్టడం.. విజయానికి అవసరమైన వ్యూహాలు రూపొందిస్తుండటం ఆసక్తికరంగా మారుతోంది.



నవతెలంగాణ- ఆదిలాబాద్ ప్రాంతీయ ప్రతినిధి

ఆదిలాబాద్ లోక్‌సభ సమరానికి సమయం దగ్గర పడింది. మరో మూడు రోజుల్లో ప్రచారం ముగియనుండగా.. పోలింగ్‌కు ఐదు రోజుల గడువు మాత్రమే ఉంది. ఈ క్రమంలో సమయం లేదు మిత్రమా అనే రీతిలో అభ్యర్థులు, ఆయా పార్టీలకు చెందిన కీలక నాయకులు, కార్యకర్తలు అందరూ జనాల్లోనే ఉండటం ఆసక్తి రేపుతోంది. ఉదయం నుంచి రాత్రి వరకు ప్రచారపర్వంలోనే ఉంటూ ఓటర్లను తమవైపు తిప్పుకునేందుకు శతవిధాలా ప్రయత్నాలు చేస్తున్నారు. ఈ సీటును ఎలాగైనా దక్కించుకొని పాగా వేయాలని కాంగ్రెస్ భావిస్తుండగా.. సిట్టింగ్ సీటును నిలుపుకోవాలని బీజేపీ అనుకుంటోంది. ఈ సీటులో విజయం సాధించడం ద్వారా పట్టు నిలుపుకోవాలని బీఆర్ఎస్ భావించడం ఆసక్తికరంగా మారింది. మూడు ప్రధాన పార్టీలు ఎవరికి వారు గెలుపు కోసం తీవ్రంగా శ్రమిస్తున్నాయి. పార్లమెంటుకు వెళ్లాలనే కుతూహలంతో పోటీ పడుతున్న అభ్యర్థులు ఎన్నికల్లో శ్రమించడం సహజం. కానీ వీరిని గెలిపించేందుకు ఆయా పార్టీలకు చెందిన కీలక నేతలు కష్టపడుతుండటం చర్చనీయాంశంగా మారుతోంది. ఓ వైపు ఎండలు మండిపోతున్నా ..అస్వస్థతకు గురవుతున్నా లెక్క చేయకుండా ప్రజల్లోకి వెళ్లి ప్రచారంలో నిమగ్నం కావడం ఆసక్తికరంగా మారింది. మరోపక్క అభ్యర్థి గెలిస్తే రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రాధాన్యం ఉంటుందనే ఉద్దేశంతో ద్వితీయ శ్రేణి నాయకులు, ఆయా పార్టీలకు చెందిన కార్యకర్తలు సైతం ప్రతిష్టాత్మకంగా తీసుకుంటున్నారు.



విజయమే లక్ష్యంగా ప్రణాళికలు..!

ఈ లోక్‌సభ స్థానాన్ని దక్కించుకునేందుకు మూడు ప్రధాన పార్టీలు నువ్వా- నేనా అనే రీతిలో పోటాపోటీగా ప్రచారం చేపడుతున్నాయి. కాంగ్రెస్ అభ్యర్థిగా బరిలో నిలిచిన ఆత్రం సుగుణను గెలిపేందుకు ఆ పార్టీ కీలక నేతలు ఆహర్నిశలు శ్రమిస్తున్నారు. ఉమ్మడి జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి సీతక్క అభ్యర్థి గెలుపు బాధ్యతలను భుజానకెత్తుకున్నారు. కొన్ని రోజులుగా లోక్‌సభ పరిధిలోనే ఉంటూ ఊరూరా ప్రచారం చేపడుతున్నారు. మంత్రితో పాటు ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు, ఇటీవల పార్టీలో చేరిన ఉమ్మడి జిల్లాకు చెందిన కీలక నేతలు, మాజీ ఎమ్మెల్యేలు, నియోజకవర్గాల ఇన్‌ఛార్జీలు వారి నియోజకవర్గాల్లో విస్తృతంగా ప్రచారం నిర్వహిస్తూ విజయానికి దోహదం చేస్తున్నారు. బీఆర్ఎస్ నుంచి ఆత్రం సక్కు పోటీలో నిలవగా.. ఈయన గెలుపు కోసం మాజీ మంత్రి, పార్టీ ఆదిలాబాద్ జిల్లా అధ్యక్షుడు జోగు రామన్న, ఎమ్మెల్యేలు అనిల్‌జాదవ్, కోవ లక్ష్మీతో పాటు ఆయా నియోజకవర్గాలకు చెందిన కీలక నాయకులు తీవ్రంగా శ్రమిస్తున్నారు. లోక్‌సభ పరిధిలో ప్రచారం నిర్వహిస్తూ అభ్యర్థి విజయం కోసం కృషిచేస్తున్నారు. బీజేపీ నుంచి మాజీ మంత్రి గోడం నగేష్ బరిలో నిలవగా.. ఈయన విజయం కోసం ఆ పార్టీ ఎమ్మెల్యేలు మహేశ్వర్‌రెడ్డి, పాయల్‌శంకర్, రామారావుపటేల్, పాల్వాయి హరీష్‌బాబు శ్రమిస్తున్నారు. వీరితో పాటు ఆ పార్టీకి చెందిన కీలక నాయకులు సైతం ప్రచారపర్వంలో నిమగ్నం కావడం ప్రాధాన్యం సంతరించుకుంది. ఇలా అభ్యర్థి విజయమే లక్ష్యంగా ఆయా పార్టీల కీలక నేతలు, ముఖ్య కార్యకర్తలు క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ ఓటర్లను తమ వైపు తిప్పుకునే ప్రయత్నం చేస్తున్నారు. వివిధ వర్గాల మద్దతు కూడగడుతూ పార్టీ అభ్యర్థి విజయమే లక్ష్యంగా ప్రయత్నాలు చేస్తుండటం ఆసక్తికరంగా మారింది.

అన్ని వర్గాల ప్రజల సంక్షేమం కాంగ్రెస్ లక్ష్యం : మాజీ మంత్రి అల్లోల



సారంగాపూర్ : అన్ని వర్గాల ప్రజల సంక్షేమం కోసం కాంగ్రెస్ కాంగ్రెస్ పార్టీకి ఓటు వేయాలని మాజీ మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి అన్నారు. బుధవారం నర్సాపూర్(జి) మండల కేంద్రంలో కార్యకర్తలను ఉద్దేశించి మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్యకర్తల అభీష్టం మేరకు నియోజకవర్గ అభివృద్ధిని కాంక్షిస్తూ కాంగ్రెస్ పార్టీలో చేరానని తెలిపారు. నియోజకవర్గంలో అనేక అభివృద్ధి పనులు చేశామన్నారు. నర్సాపూర్ కొత్త మండలం ఏర్పాటు, అంతర్గత రోడ్లు ఇలా అనేక అభివృద్ధి పనులు చేపట్టామని తెలిపారు. తన సేవలను ప్రజలు గుర్తించకపోవడం వల్ల గత ఎన్నికల్లో పరాజయం పాలయ్యాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఉమ్మడి జిల్లాలో జడ్పీ చైర్మన్‌గా, రెండుసార్లు ఎంపీగా, నాలుగుసార్లు ఎమ్మెల్యేగా గెలిచిన అనుభవంతో అభివృద్ధి పనులు చేపట్టానని తెలిపారు. పదేండ్లలో దేశంలో బిజెపి ప్రభుత్వం ఎలాంటి అభివృద్ధి చేయలేదని , కులాల మధ్య విద్వేషాలు రెచ్చగొట్టడం తప్ప ఏమీ చేయలేదని విమర్శించారు. గతంలో కాంగ్రెస్ పార్టీతో ఉన్న అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు. కాంగ్రెస్‌తోనే దేశం అభివృద్ధి జరుగుతుందని, పార్టీ అభ్యర్థి ఆత్రం సుగుణను గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు రామయ్య, రమణారెడ్డి, నర్సాగౌడ్ పాల్గొన్నారు.

మాదిగలు మందకృష్ణకు పాలేర్లు కాదు



ఆదిలాబాద్‌టౌన్ : మాదిగలు మందకృష్ణకు పాలేర్లు కాదని, ఆయన చెప్పినవారికే ఓటు వేయరని మాదిగ జేఏసీ జిల్లా అధ్యక్షులు మల్యాల మనోజ్ మాదిగ అన్నారు. తమ సంపూర్ణ మద్దతు కాంగ్రెస్ పార్టీకేనని తెలిపారు. బుధవారం జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జి మోతే బారిక్‌రావు, రాష్ట్ర వైస్ చైర్మెన్ నక్క రాందాస్‌తో కలిసి మాట్లాడారు. రాజ్యాంగాన్ని రక్షించేది, కుల వర్గీకరణ చేసేది కాంగ్రెస్సేనని అన్నారు. అధికారంలోకి వస్తే వందరోజుల్లోనే వర్గీకరణ చేస్తామని గద్దె నెక్కిన బీజేపీ మాదిగలను మోసం చేసిందన్నారు. అటు ఎన్నికలు వచ్చినప్పుడే మందకృష్ణ మాదిగకు వర్గీకరణ అంశం గుర్తుకొస్తుందన్నారు. ఏదో ఒక పార్టీకి అమ్ముడుపోయి మాదిగల ఆత్మగౌరవాన్ని ఆయన తాకట్టుపెట్టి జేబులు నింపుకుంటున్నారంటూ ధ్వజమెత్తారు. మైనార్టీలు, మాదిగల హక్కులు నెరవేర్చని బీజేపీని చిత్తుగా ఓడిస్తామని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ బలపరిచిన ఆదివాసీ పేదింటి బిడ్డ ఆత్రం సుగుణకు ఓటువేసి గెలిపించాలని బహుజనులను కోరారు. మీడియా సమావేశంలో మాదిగ జేఏసీ జిల్లా ప్రధాన కార్యదర్శి లింగంపల్లి ప్రసన్నకుమార్, నాయకులు ముక్కెర అశోక్, కత్తి గంగాధర్, చొప్పదండి భూమన్న, బట్టు మహేందర్, సుదర్శన్ పాల్గొన్నారు.

బూటకపు హామీలతో గద్దెనెక్కిన బీజేపీకి బుద్ధి చెప్పాలి



ఖానాపూర్ : బూటకపు హామీలతో గద్దెనెక్కిన బిజెపికి ప్రజలు తగిన బుద్ధి చెప్పాలని సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు దుర్గం నూతన్‌కుమార్ అన్నారు. ఖానాపూర్ ఏరియా కమిటీ ఆధ్వర్యంలో బుధవారం కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇండియా కూటమి బలపరుస్తున్న కాంగ్రెస్ అభ్యర్థి ఆత్రం సుగుణను చేతి గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని తెలిపారు. బీజేపీ ప్రభుత్వం సంవత్సరానికి కోటి ఉద్యోగాలు కల్పిస్తామని ఆశ చూపి మోసం చేసిందని విమర్శించారు. అక్షింతలు ప్రజలకు పంపి రూ.16లక్షల కోట్లు నరేంద్ర మోడీ దోస్తులకు రాయితీ ఇచ్చారని తెలిపారు. అబద్ధపు హామీలతో అధికారంలోకి వచ్చిన బిజెపిని ఈ ఎన్నికల్లో చిత్తుగా ఓడించి ఆదివాసి ముద్దుబిడ్డ ఆత్రం సుగుణను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ ఏరియా కమిటీ కార్యదర్శి డాకురు తిరుపతి, మండల కార్యదర్శి నాగెల్లి నర్సయ్య, జిల్లా కమిటీ సభ్యులు తొడసం శంభు, నారాయణ, రాజేష్, గంగారాం పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థినికి తపస్ సన్మానం

ఆదిలాబాద్‌టౌన్: ఇటీవల విడుదలైన టీఎస్‌పీఎస్సీ ఫలితాలలో ఆదిలాబాద్‌కు చెందిన ఏబీవీపీ పూర్వ విద్యార్థి శైలజ మహాత్మా జ్యోతిబాపూలే జూనియర్ కాలేజీలో పీడీగా ఎంపికయ్యారు. ఈ సందర్భంగా తపస్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో బుధవారం ఆమె నివాసంలో ఘనంగా సన్మానించి, శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు సునీల్ చౌహన్, వలభోజు గోపీకృష్ణ, డైట్ ప్రిన్సిపాల్ కిరణ్ కుమార్, నాయకులు అల్లూరి మనోజ్‌రెడ్డి, బత్తుల గంగాధర్ పాల్గొన్నారు.



మత వైశామ్యాలు రెచ్చగొడుతున్న మోడీ

- బీజేపీకి ఓటు వేస్తే హక్కులు కోల్పోయినట్టే
- ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మల్లు
- తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేస్తామని భరోసా



నవతెలంగాణ- ఆదిలాబాద్ ప్రాంతీయ ప్రతినిధి

మూడో సారి ప్రధాని అవుతానన్న ఆశలు పోయి ఓటమి భయంతో ప్రధాని మోడీ దేశంలో మత వైశమ్యాలు రెచ్చగొట్టే ప్రయత్నం చేస్తున్నారని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు అన్నారు. బుధవారం నిర్మల్ జిల్లా కేంద్రంలో జరిగిన ఆదిలాబాద్ పార్లమెంట్ కాంగ్రెస్ ముఖ్య నాయకుల సమావేశానికి కాంగ్రెస్ తెలంగాణ ఇన్‌చార్జి దీపాదాస్ మున్షీ తో కలిసి హాజరయ్యారు. పార్లమెంటు నియోజకవర్గం అభ్యర్థి ఆత్రం సుగుణ విజయానికి ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహాలపై కాంగ్రెస్ శ్రేణులకు దశా దిశా నిర్దేశం చేశారు. ఈనెల 13న పోలింగ్ జరగడానికి కేవలం నాలుగు రోజులు ఉన్న నేపథ్యంలో చాలా జాగ్రత్తగా పోల్ మేనేజిమెంట్ నిర్వహించాలని సూచనలు చేశారు. అనంతరం మీడియాతో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారత రాజ్యాంగాన్ని ప్రజాస్వామ్యాన్ని మార్చాలని కుట్ర చేస్తున్న బీజేపీకి ఓటు వేస్తే మన హక్కులు పోతాయన్నారు. ప్రజాస్వామ్య భారత రాజ్యాంగ పరిరక్షణకు దేశ ప్రజలు కాంగ్రెస్‌ను గెలిపించుకోవాల్సిన అవసరముందన్నారు. నియంతృత్వంతో రాజ్యాంగాన్ని మార్చాలని చూస్తున్న మోడీ ఒకవైపు, రాజ్యాంగాన్ని ప్రజాస్వామ్యాన్ని కాపాడి దేశంలో లౌకికవాదాన్ని నిలబెట్టాలని ప్రజల కోసం పోరాటం చేస్తున్న రాహుల్ గాంధీ మరో వైపు ఈ ఎన్నికల సంగ్రామంలో నిలబడ్డారన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీల రిజర్వేషన్లు తొలగించాలని కుట్ర చేస్తున్న మోడీకి గట్టి బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలు వేర్వేరు కాదని ఈ రెండు పార్టీలు ఒకటేనని మరోసారి ఈ పార్లమెంట్ ఎన్నికల్లో రుజువైందన్నారు. బీఆర్ఎస్‌కు ఓటు వేస్తే బీజేపీకి వేసినట్టే అవుతుందన్నారు. పార్లమెంటులో బీజేపీ ప్రభుత్వం తీసుకొచ్చిన అనేక ప్రజా వ్యతిరేక చట్టాలకు బీఆర్ఎస్ ఎంపీలు మద్దతి ఇచ్చిన విషయాన్ని ఈ సందర్భంగా గుర్తు చేశారు. బీఆర్ఎస్, బీజేపీలు ఒకరికొకరు గెలిపించుకోవడానికి ప్రయత్నం చేస్తున్నాయని విమర్శించారు. దేశ సంపదను సంపన్నులకు వ్యాపారులకు దోచిపెట్టి బీజేపీ పార్టీ, రాష్ట్ర సంపదను దోపిడీ చేసిన బిఆర్ఎస్ పార్టీలు ఈ పార్లమెంటు ఎన్నికల్లో చేతులు కలిపి మరోసారి ప్రజలను మోసం చేయడానికి వస్తున్నాయని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. రైతు భరోసా రాకుండా ఆ పార్టీలు కుట్ర చేస్తున్నాయని మండిపడ్డారు. రైతులను తప్పుదోవ పట్టించే విధంగా ఈ రెండు పార్టీలు వ్యవహరిస్తున్నాయని విమర్శించారు. ఓబిసి కులగణన ద్వారా దేశ సంపద రాజ్యాధికారంలో జనాభా దమాషా ప్రకారం వారికి వాటా లభిస్తుందని రాహుల్‌గాంధీ బీజేపీ పాలకులకు పలుమార్లు విన్నవించిన పట్టించుకోలేదన్నారు. రాష్ట్రంలో కుల గణన మొదలుపెట్టామని కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే దేశంలో కూడా కులగణన కచ్చితంగా చేపట్టి జనాభా దామాష ప్రకారంగా హక్కులు, సంపద కల్పిస్తామని వెల్లడించారు.

బీఆర్ఎస్ మోసం చేసింది

పదేండ్లు అధికారంలో ఉన్న బీఆర్ఎస్ ప్రభుత్వం సాగు నీళ్లు ఇవ్వకుండా ఆదిలాబాద్ ప్రజలను మోసం చేసిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో ప్రారంభించిన ప్రాణహితను విస్మరించి కాళేశ్వరం నిర్మించి ఆదిలాబాద్ జిల్లా ప్రజలకు కష్టాలను చూపించిందని వివరించారు. ఎన్నికల తర్వాత ప్రాణహితను కచ్చితంగా నిర్మిస్తామని ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని లక్షల ఎకరాలకు సాగునీరు అందిస్తామన్నారు. ఇక్కడ వివిధ సాగునీటి ప్రాజెక్టులను కాంగ్రెస్ హయాంలోనే నిర్మించామని గుర్తుచేశారు. ఆదిలాబాద్ ఉమ్మడి జిల్లాలో భూములపై ఆదివాసి గిరిజనులకు ఉన్న హక్కులను ధరణి ద్వారా గత పాలకులు చిన్నాభిన్నం చేశారన్నారు. ట్రైబల్, నాన్ ట్రైబల్ ప్రజల భూ సమస్యలను పరిగణలోకి తీసుకొని వారికి త్వరలోనే న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. ఐటీడీఏలను బలోపేతం చేస్తూ వందశాతం నిధులు ఇచ్చి పూర్వవైభవం తీసుకువస్తామన్నారు.

రైతులు ఆందోళన చెందకూడదు

అకాల వర్షం, గాలి దూమారం కారణంగా నష్టపోయిన రైతులను కచ్చితంగా ఆదుకుంటామని, పంట నష్టం అంచనా వేయాలని ఇప్పటికే అధికారులకు ఆదేశాలు ఇచ్చామని తెలిపారు. ఎన్నికల తర్వాత పరిహారం ఇస్తామన్నారు. అకాల వర్షంతో కల్లాల వద్ద, ఐకెపి కొనుగోలు కేంద్రాల వద్ద తడిసిన ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని, రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. ప్రజా ప్రభుత్వంలో ప్రతి పైసా ప్రజల కోసమే ఖర్చు చేస్తామని వెల్లడించారు. ప్రశ్నించే గొంతుక ఆత్రం సుగుణను గెలిపించుకుంటే అమాయక ఆదివాసీ గిరిజన ప్రజల గళాన్ని పార్లమెంటులో వినిపిస్తుందని చెప్పారు. ఈ సమావేశంలో మంత్రి సీతక్క, నిర్మల్ డీసీసీ అధ్యక్షులు శ్రీహరి రావు, ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు, మాజీ మంత్రులు ఇంద్రకరణ్‌రెడ్డి, వేణుగోపాలచారి, ఆయా నియోజకవర్గాల ఇన్‌ఛార్జీలు పాల్గొన్నారు.

పెద్దపల్లిలో నువ్వా..నేనా..!

- ముమ్మరంగా కొనసాగుతున్న ప్రచారం
- కాంగ్రెస్‌కు కలిసొచ్చే అవకాశం

నవతెలంగాణ-జైపూర్

పెద్దపల్లి పార్లమెంట్ పరిధిలో నువ్వా నేనా అనే విధంగా ప్రచారం ముమ్మరంగా కొనసాగుతోంది. ప్రధాన పార్టీలైన కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీ అభ్యర్థులు పోటీ పడుతున్నారు. ఎన్నికలకు మరో నాలుగు రోజుల వ్యవధి ఉన్నందున ప్రధాన పార్టీల ప్రచారం ముమ్మరంగా సాగుతోంది. ఉదయం ఆరు గంటల నుండి అర్ధరాత్రి వరకు ఓటర్లను కలిసేందుకు అభ్యర్థులు పోటీ పడుతున్నారు. అభ్యర్థులను గెలిపించుకోడం కోసం స్థానిక నాయకులు తీవ్రంగా శ్రమిస్తున్నారు. ప్రచారంలో ఉత్సాహంగా పాల్గొంటున్నారు. అభ్యర్థుల తరపున గ్రామాల్లో గడపగడపకు తిరుగుతూ ప్రచారం చేస్తున్నారు. ఉదయం పూట ఉపాధి పనుల్లో ఉండే గ్రామీణులను కలిసి ఓట్లు అభ్యర్థిస్తున్నారు. అధికార కాంగ్రెస్ అభ్యర్థి గడ్డం వంశీకృష్ణతో పాటు తండ్రి చెన్నూర్ ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి రాత్రీపగలు తేడా లేకుండా ప్రచారం చేస్తున్నారు. బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్ సైతం నియోజకరవ్గంలో ప్రచారం ముమ్మరం చేశారు. మరో వైపు మంత్రి శ్రీధర్ బాబు వంశీకృష్ణ గెలుపుకు కృషి చేస్తుండగా, మంచిర్యాల ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్‌రావు తనదైన శైలిలో ప్రచారం చేస్తున్నారు. వంశీ భారీ మెజార్టీతో గెలవబోతున్నాడని ఎన్నికల సభల్లో ధీమా వ్యక్తం చేస్తున్నారు. ఇండియా కూటమిలో ఉన్న కాంగ్రెస్ అభ్యర్థి వంశీకృష్ణ గెలుపు కోసం సీపీఐ(ఎం) నాయకులు జిల్లా వ్యాప్తంగా పర్యటిస్తూ ప్రచారం చేస్తున్నారు. కాంగ్రెస్ అభ్యర్థికి అనుకూల అంశాలు ఎక్కువగా ఉండడంతో పార్టీ శ్రేణుల్లో ఉత్సాహం కన్పిస్తోంది. బీఆర్ఎస్ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్‌తో పాటు పార్టీ జిల్లా అధ్యక్షులు, చెన్నూర్ మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ ప్రచారం చేస్తున్నారు. బీఆర్ఎస్‌ను వీడి కాంగ్రెస్‌లో చేరిన వారిని తిరిగి బీఆర్ఎస్‌లో చేర్చుకునేందుకు అనుయులతో సంప్రదింపులు జరుపుతున్నారు. తటస్థులుగా ఉన్న వారిని పార్టీలో చేర్చుకుంటూ భవిష్యత్తులో సముచిత స్థానం కల్పిస్తామని భరోసా కల్పిస్తున్నారు. అభ్యర్థి కొప్పుల ఈశ్వర్‌తో పాటు కోల్‌బెల్ట్ ఏరియా నాయకులతో కలిసి కార్మికులను కలస్తూ కారు గుర్తుకు ఓటేసేలా ప్రచారం చేస్తున్నారు. మందమర్రి, రామకృష్ణాపూర్ మున్సిపాల్టీలపై ప్రత్యేక దృష్టి సారించారు. బీజేపీ అభ్యర్థి గోమాసే శ్రీనివాస్ గెలుపును ఆకాంక్షిస్తూ పార్టీ జిల్లా అధ్యక్షులు వెరబెల్లి రఘునాథ్ విస్తృతంగా ప్రచారం చేస్తున్నారు. నేతకాని సామాజిక వర్గానికి చెందిన శ్రీనివాస్ తన సామాజిక వర్గం ఓట్లు చీలి పోకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నారు.





జోరుగా పార్లమెంట్ ఎన్నికల ప్రచారం



నవతెలంగాణ-సారంగాపూర్

మండలంలోని కౌట్ల(బి), స్వర్ణ, లింగాపూర్ గ్రామాలలో బుధవారం పార్లమెంట్ ఎన్నికల ప్రచార సరళి వైవిధ్య భరితంగా కొనసాగింది. బార్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు అల్లూరి మల్లారెడ్డి తమ బృందంతో కలిసి మండుటెండలను సైతం లెక్కచేయకుండా కాంగ్రెస్ పార్టీ తరపున ప్రచారం చేపట్టారు. ఉపాధి హామీ కూలీలను ఆప్యాయంగా పలకరించి కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను వివరించారు. 13న జరగబోయే ఎన్నికల్లో చేతు గుర్తుకు ఓటు వేయాలని అభ్యర్థించారు. ఎంపీ అభ్యర్థి ఆత్రం సుగుణక్కను అందరి ఆడబిడ్డగా ఆదరించి భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు. ఎండలో పనులు చేస్తున్న ఉపాధి కూలీలకు మజ్జిగ పంపిణీ చేశారు. ప్రచారంలో కాంగ్రెస్ ఎస్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు బాణవత్ గోవింద నాయక్, కాంగ్రెస్ కిసాన్ సెల్ చైర్మన్ పోతారెడ్డి, ఉప అధ్యక్షుడు కాంబ్లే సూర్యకాంత్, కాంగ్రెస్ నాయకులు, వ్యాపారవేత్త సత్యనారాయణ, మండల కాంగ్రెస్ ఎస్టీ సెల్ అధ్యక్షులు భీంరావు, నాయకుడు పోతారెడ్డి, సిపిఐ నాయకుడు ఎస్ఎన్ రెడ్డి, పౌర హక్కుల సంఘం నాయకులు బోరన్న, శశికళ పాల్గొన్నారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
ఆదిలాబాద్-నిర్మల్
గురువారం | మే 09, 2024 | www.navatelangana.com

లింగోజీ తండాలో బీఆర్ఎస్ ప్రచారం

నవతెలంగాణ-ఉట్నూర్

మండలంలోని లింగోజీతండాలో బీఆర్ఎస్ నాయకులు పార్టీ ఎంపీ అభ్యర్థి ఆత్రం సక్కు తరపున సీనియర్ నాయకుడు శ్యామ్ నాయక్ ప్రచారం నిర్వహించారు. గడపగడపకు తిరుగుతూ కారు గుర్తుకు ఓటేయ్యాలని అభ్యర్థించారు. కార్యక్రమం రాథోడ్ విజయ్ కుమార్, జాదవ్ వినోద్, కంబ్లె మహదు, సంజు, నిఖిల్ ఉన్నారు.

నార్నూర్ : మండల కేంద్రంతో పాటు ఆయా గ్రామాల్లో బుధవారం బీఆర్ఎస్ నాయకులు ఇంటింటికి తిరుగుతూ ఎంపీ అభ్యర్థి ఆత్రం సక్కు తరపున ప్రచారం నిర్వహించారు. కారు గుర్తుకు ఓటేసి భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఇందులో మాజీ సర్పంచుల సంఘం మండల అధ్యక్షులు యుర్వేత రూపదేవ్, పీఏసీఎస్ ఇన్‌చార్జి చైర్మన్ సురేష్ ఆడే, పార్టీ కార్యదర్శి సయ్యద్ ఖాసీం, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ తొడసం నాగోరావ్, మాజీ సర్పంచులు కనక సెవంత ప్రభాకర్, రాథోడ్ సుభద్ర రామేశ్వర్, మాజీ ఉపసర్పంచ్ చవాన్ మహేందర్, మాజీ ఎంపీటీసీ రాథోడ్ రమేష్, శశాంక్, రాథోడ్ జితేందర్ ఉన్నారు.

కేంద్రంలో కాంగ్రెస్ రావడం ఖాయం

నవతెలంగాణ-తాంసి

కేంద్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రావడం ఖాయమని బోథ్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆడే గాజెందర్ అన్నారు. బుధవారం మండలంలోని కప్పర్ల, పాలోడి గ్రామాలలో డీసీసీబీ చైర్మెన్ అడ్డి భోజారెడ్డి, మండల నాయకులతో కలిసి ప్రచారం నిర్వహించారు. భీంపూర్ మండలంలోని కరంజి గ్రామంలో కాంగ్రెస్ అభ్యర్థి ఆత్రం సుగుణ గెలుపు కోసంకు మాజీ ఎమ్మెల్యే రాథోడ్ బాపూరావ్, డీసీసీబీ చైర్మన్ అడ్డి భోజారెడ్డితో కలిసి ఎన్నికల ప్రచారం చేపట్టారు. రాష్ట్రంలో అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. బీజేపీ, బీఆర్ఎస్ ప్రజలను మోసం చేసి ఓట్లు సీట్లు దండు కోవడమే తప్ప అభివృద్ధి చేతకాని పార్టీలన్నారు. కేంద్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రావడం రాహుల్ గాంధీ ప్రధాన మంత్రి కావడం ఖాయమని ధీమావ్యక్తం చేశారు. కరంజి గ్రామానికి చెందిన వివిధ పార్టీల నాయకులు కాంగ్రెలో చేరాగా వారికి కండువాలు కప్పి ఆహ్వానించారు. కార్యక్రమంలో నాయకులు అశోక్, నారాయణ, సంతోష్, శ్రీధర్ రెడ్డి, రామన్న యాదవ్, దేవారెడ్డి, రమేష్, మల్లేష్ నాయకులు, కార్యకర్తలున్నారు.

మందోట స్థలం కుల సంఘాలది

- అక్రమంగా కాజేయాలని చూస్తే ఊరుకోం
- తీవ్రంగా హెచ్చరించిన ఖానాపూర్ గ్రామ కమిటీ



నవతెలంగాణ-ఖానాపూర్‌టౌన్

పట్టణంలోని మార్కెట్ యార్డు పక్కన ఉన్న మందోట స్థలంపై కొందరు సంబంధం లేని వ్యక్తులు తల దూర్చడం మానుకోవాలని ఖానాపూర్ గ్రామ కమిటీ పెద్దలు హెచ్చరించారు. అప్పట్లో గ్రామాభివృద్ధి పరిధిలో ఉన్న 15 కుల సంఘాలు కలిసి ఆస్థలాన్ని కొనుగోళుచేసినట్లు వివరించారు. బుధవారం కుల సంఘాల సభ్యులు కలిసి స్థానిక ప్రెస్ క్లబ్‌లో మాట్లాడారు. 60 ఏండ్ల క్రితం ఖానాపూర్ పట్టణం పోలీసు స్టేషన్ వరకే విస్తరించి ఉండేదని, అటు దాటితే అంతటా పంట చేండ్లు ఉండేవని తెలిపారు. అప్పట్లో అన్ని కులాల వారికి పశు సంపద ఎక్కువగా ఉన్న నేపథ్యంలో వాటిని ఒక చోట మంద పెట్టడానికి స్థలం లేక రైతులు ఇబ్బంధి పడేవారన్నారు. పశువులకు ఇబ్బంధి కలుగకుండా ఉండేలా వాగుకు సమీపంలో సౌకర్యంగా ఉంటుందని భావించి అప్పటి పెండకమిటీ (గ్రామాభివృద్ధి కమిటీ) పెద్దలు కలిసి మందోట స్థలాన్ని కొనుగోలు చేసినట్లు తెలిపారు. పట్టణ పరిధిలోని తిమ్మాపూర్ శివారులో గల సర్వే నంబర్ 217లోని ఎకరం 16 గుంటల భూమిని 1960-1965 మధ్య కాలంలో చాకలి రాజయ్య వద్ద అప్పటి గ్రామ పెద్దలు రూ. 500లకు కొనుగోళు చేశారన్నారు. సాదా పత్రంపై జరిగిన కొనుగోళుపేపర్‌ను అప్పటి రెవెన్యూ అధికారులకు ఇచ్చిన క్రమంలో 1965 నుంచి 2017 వరకు పట్టాదారుగా చాకలి రాజయ్య అనుభవదారు కాలంలో మందోటగా రెవెన్యూ రికార్డులో నమోదై ఉన్నట్లు తెలిపారు. తెలంగాణ ఏర్పాటు తర్వాత కొత్తగా ఏర్పాటైన ప్రభుత్వం భూ రికార్డుల ప్రక్షాళన పేరుతో అనుభవదారు కాలం తొలగించిన నేపథ్యంలో రెవెన్యూ అధికారులు ఎలాంటి విచారణ లేకుండా పట్టా మార్పిడి చేయశారన్నారు. ఇదే సాకుగా చూసుకొని పట్టణంలోని కొందరు నాయకులు, పట్టాదారుతో ఎలాంటి సంబంధం లేని వ్యక్తులు ఈ భూమిని దురాక్రమణ చేయాలనుకోవడం మంచిది కాదన్నారు. తమ వద్ద ఎలాంటి దస్త్రాలు లేవని మందోట స్థలంను కాజేయాలనే దురాలోచనతో ఉన్న నాయకులు, వ్యక్తులు, ఇకనైనా తమ పద్ధతిని మానుకోవాలని హెచ్చరించారు. మందోట స్థలానికి సంబంధించిన రెవెన్యూ దస్త్రాలను విలేఖరుల ముందు ప్రదర్శించారు.

రెవెన్యూ అధికారులపై ఫిర్యాదు చేస్తాం

అనుభవ దారు కాలంలో ఉన్న పేరును ఎలాంటి విచారణ లేకుండా మార్చిన రెవెన్యూ అధికారులపై కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తామని గ్రామ కమిటీ పెద్దలు తెలిపారు. అక్కడ పరిష్కారం కాకుంటే రెవెన్యూ ఇంటలీజెన్స్ విభాగం వరకు వెళ్లి మందోట భూమిని కాపాడు కుంటామని కుల సంఘాల పెద్దలు స్పష్టం చేశారు. విలేకరుల సమావేశంలో ఖానాపూర్ గ్రామ కమిటి కుల పెద్దలు సతీష్ రావు, మేర గంగాధర్, చిన్న నర్సాగౌడ్, కుమ్మరి ఇస్తారి, ఆప్కారి నర్సయ్య, నేత శ్యాం, దాసరి భీమన్న పోషన్న యాదవ్, బోడమల్లయ్య ఎల్. కిషన్, ఎం.గంగాధర్, బిల్ల శంకర్, మద్దెల రాజన్న, జోగు రాజేశ్వర్, బీమనాతి గంగారాజం ఉన్నారు.

జొన్నల కొనుగోలు నిలిపివేత

నవతెలంగాణ-ఉట్నూర్

మండలంలోని హస్నాపూర్ మార్కెట్ యార్డులో జొన్నల కొనుగోలు నిలిపివేసినట్లు ఉట్నూర్ పీఏసీఎస్ సీఈఓ చిలుకూరి మల్లయ్యా బుధువారం ఒక్క ప్రకటనలో పేర్కొన్నారు. వర్షాల కారణంగా కొన్ని రోజుల పాటు జొన్నల కొనుగోలు నిలిపి వేశామని రైతులు గమనించి జొన్నలను ఇంటి వద్దే భద్రంగా ఉంచాలన్నారు. తిరిగి కొనుగోళుచేసే తేదిని ప్రకటిస్తామన్నారు.

ఒక్క అవకాశం ఇవ్వండి.. అభివృద్ధి చేసి చూపిస్తాం

- జిల్లా ఇన్‌చార్జి మంత్రి దనసరి అనసూయ

నవతెలంగాణ-లక్ష్మణచాంద

ఆదిలాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ అభ్యర్థి ఆత్రం సుగుణకు ఒక్క అవకాశం ఇవ్వండి అభివృద్ధి చేసి చూపిస్తామని ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఇన్‌చార్జి మంత్రి దనసరి అనసూయ(సీతక్క) అన్నారు. నిరుపేద ఆదివాసీ మహిళకు అవకాశం ఇస్తే అభివృద్ధికి కట్టుబడి ఉంటుందని తెలిపారు. బుధవారం మండలంలోని వడ్యాల్, రాచపూర్, బాబాపూర్, నర్సాపూర్ డబ్ల్యూ గ్రామాల్లో ఉపాధి హామీ కూలీలను కలిసి పార్లమెంట్ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. పేదల అభ్యున్నతికి ఉపాధి హామీ పథకం ప్రవేశ పెట్టిన కాంగ్రెస్ పార్టీకి ఓటు వేయాలని కోరారు. అధికారంలోకి రాగానే ఉపాధి హామీ కూలీని రూ.400కు పెంచుతామని హామీ ఇచ్చారు. త్యాగల పార్టీ కాంగ్రెస్‌తో మాత్రమే అభివృద్ధి సాధ్యమన్నారు. బీజేపీ, బీఆర్ఎస్ జంట పార్టీలని దుయ్యబాట్టారు. బీఆర్ఎస్ కు ఓటు వేస్తే మురికి కాలువలో వేసినట్లేనని పేర్కొన్నారు. గుడిలో ఉండాల్సిన దేవుడిని జెండాలపై వేసి ఊరేగింపులు చేస్తూ మత రాజకీయలకు బీజేపీ నాయకులు పాల్పడుతున్నారన్నారు. నల్ల ధనం తీసుకొస్తామని నీతులు చెప్పిన పార్టీ పదేండ్లలో చేసిందేమి లేదన్నారు. కాంగ్రెస్ అంటేనే సంక్షేమ పథకాల పార్టీ అని, ప్రతి ఒక్కరూ ఆదరించి చేతి గుర్తుకు ఓటు వేయాలని అభ్యర్థించారు. పార్లమెంట్ అభ్యర్థి ఆత్రం సుగుణ మాట్లాడుతూ తన కుటుంబం పేదల కోసం పాటు పడిన చరిత్ర అని, సేవే ధ్యేయంగా కొనసాగుతామన్నారు. ధాన్యం కొనుగోలు గురుంచి రైతులు అడగగా మంత్రి స్పందిస్తూ కలెక్టర్‌కు ఆదేశాలు ఇవ్వడం జరిగిందని ఎలాంటి ఇబ్బంది లేకుండా చూస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో డీసీసీ అధ్యక్షులు శ్రీహరి రావు, మండల కాంగ్రెస్ అధ్యక్షులు వొద్నల రాజేశ్వర్, ఈటెల శ్రీనివాస్, జడ్పీటీసీ ఓస రాజేశ్వర్, అట్ల రాంరెడ్డి, అట్ల రవీందర్ రెడ్డి, నరేష్ రెడ్డి, ప్రతాప్ రెడ్డి, చిన్న రాం రెడ్డి, సమ్మెట రవి, నగేష్ పాల్గొన్నారు.

శభాష్ సీతక్క..

రాచపూర్‌లోని చెరువులో పని చేస్తున్న ఉపాధి హామీ కూలీలను కలవడానికి సెక్యూరిటీ, ప్రోటోకాల్‌ను పక్కన పెట్టి సాధారణంగా ద్విచక్ర వాహనం ఎక్కి మంత్రి సీతక్క చెరువులో వెల్లడం చూసి స్థానికులు అవక్కాయ్యారు. సీతక్క అంటే నిరడంబరతకు మారు పేరని మరొక్క సారి చాటారు. ఒక మంత్రిగా ఇంతటి సాధారణ ప్రజా జీవితం అందరికి సాధ్యం కాదని జనం చర్చించుకున్నారు.





రిజార్వేషన్లు ఎత్తివేసే యోచనలో బీజేపీ

- సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి దర్శనాల మల్లేష్
- ఇండియా కూటమి అభ్యర్థిని గెలిపించాలని పిలుపు



నవతెలంగాణ-తలమడుగు

మరోసారి కేంద్రంలో అధికారంలోకి వస్తే రిజార్వేషన్లను ఎత్తివేసే యోచనలో బీజేపీ ఉందని సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి దర్శనాల మల్లేష్ అన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో ఇండియా కూటమి బలపరిచిన కాంగ్రెస్ అభ్యర్థిని గెలిపించాలని కోరారు. బుధవారం పార్టీ నాయకులతో కలిసి ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ప్రతి ఇంటింటికి తిరుగుతూ అభ్యర్థి ఆత్రం సుగుణను గెలిపించాలని కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పదేండ్ల పాలనలో బీజేపీ జిల్లా అభివృద్ధికి ఏ ఒక్క కేంద్ర ప్రాజెక్టును మంజూరు చేయలేదన్నారు. మూతపడ్డ సిమెంట్ పరిశ్రమను తెరిపిస్తామని గత ఎన్నికల్లో హామీ ఇచ్చి గెలిచాక జిల్లా ప్రజలను మోసం చేశారని గుర్తు చేశారు. మరోసారి బిజెపి గెలిపిస్తే రాజ్యాంగాన్ని పూర్తిగా మార్చడంతో పాటు హక్కులను కాల రాస్తారన్నారు. ప్రభుత్వ రంగ సంస్థలను నిర్వీర్యం చేస్తూ రిజర్వేషన్లను ఎత్తివేసే ఆలోచన చేస్తుందన్నారు. ప్రజాస్వామ్య హక్కులను కాలరాస్తూ ప్రశ్నించే గొంతుకలపై దాడి చేస్తూ నియంతృత్వ పాలన కొనసాగిస్తున్నారని మండిపడ్డారు. రైతుల ఆదాయం రెట్టింపు చేస్తామని, ఏడాదికి రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తామని మోడీ ప్రభుత్వం బూటకపు హామీలను ఇచ్చి గెలిచాక రైతు వ్యతిరేక నల్ల చట్టాలను అమల్లోకి తీసుకువచ్చి 800 మంది రైతుల చావులకు కారణమైందన్నారు. దేశవ్యాప్తంగా ఉన్న రైతుల రుణమాఫీ చేయడానికి రూ. 18 లక్షల కోట్ల దొరకడం లేదు కానీ రూ. 17.50 లక్షల కోట్లు కార్పొరేట్ల రుణాలను మాఫీ చేసి స్వామి భక్తిని ప్రదర్శించిందని ఆరోపించారు. కార్పొరేట్లకు నమ్మిన బంటుగా బీజేపీ పాలన చేసిందన్నారు. ప్రజా కార్మిక కర్షక వ్యతిరేక విధానాలను అవలంబించి దేశంలో అన్నదమ్ముల కలిసున్న హిందూ ముస్లింల మధ్య గొడవలు సృష్టించి మతోన్మాదాన్ని ప్రేరేపిస్తున్న బీజేపీని ఓడించి ప్రజలు తగిన బుద్ధి చెప్పాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు అన్నమొల్ల కిరణ్, జిల్లా కమిటీ సభ్యులు బొజ్జ ఆశన్న, నాయకులు లింగాల చిన్నన్న, కాంగ్రెస్ నాయకులు రావుల నారాయణ పాల్గొన్నారు.

మెరుగైన వైద్యం అందించడమే లక్ష్యం

- ఏజెన్సీ డీఎంహెచ్‌ఓ మనోహర్



నవతెలంగాణ-నార్నూర్

ఏజెన్సీ గ్రామాల్లో ప్రజలకు మెరుగైన వైద్యం అందించడమే లక్ష్యమని ఏజెన్సీ డీఎంహెచ్ఓ కుడ్మేత మనోహర్ అన్నారు. బుధవారం మండలంలోని నాగల్‌కొండలో హైదరాబాద్‌కు చెందిన వైద్య నిపుణులచేత మొబైల్ వైద్య శిభిరం నిర్వహించారు. నాగల్‌కొండతో పాటు బేతల్‌గూడ, మరప్పగూడ గ్రామపంచాయతీ పరిధిలోని గ్రామాల ప్రజలు సద్వినియోగం చేసుకున్నారు. ఓపీలో 176 మందిలో 35 గర్భిణీలకు అవసరమైన వైద్య పరీక్షలు నిర్వహించినంతరం ఉచితంగా మందులు పంపిణీ చేశారు. వైద్య శిబిరంలో మహిళ నిపుణురాలు డా. సంగీత, జనరల్ ఫిజిషన్ డా.సాయినాథ్, పీహెచ్‌సీల వైద్యులు రాంబాబు, మనోజ్, రాజమణి, హెచ్ఈఓలు తులసిదాస్, నాందేవ్,హెల్త్ సూపర్‌వైజర్లు రాజమ్మ, సతవ్వ, వైద్య సిబ్బంది సుశీల, శిరీష్ కుమార్, కైలాష్, జవహర్ లాల్, గోకుల్, ఈశ్వర్, ప్రియాంక ఉన్నారు.

పోస్టల్ బ్యాలెట్‌ను వినియోగించుకున్న ఉద్యోగులు



నవతెలంగాణ-ఉట్నూర్

పట్టణంలోని ఆర్డీఓ కార్యాలయంలో పోస్టల్ బ్యాలెట్ ఓటు హక్కును ఉద్యోగులు వినియోగించుకున్నారు. ఎన్నికల విధుల్లో ఉన్న అధికారులు, ఉద్యోగులు దరఖాస్తు చేసుకోగా బుధవారం ఓటు వేశారు. ఆర్డీఓ కార్యాలయంలో వారికి ఏర్పాట్లు చేశారు.

నూతన గ్రామ కమిటీ ఎన్నిక



నవతెలంగాణ-కడెం

మండలంలోని మాసాయిపేట గ్రామ అభివృద్ధి కమిటీ సభ్యులను సోమవారం గ్రామస్తులు ఎన్నుకున్నారు. నూతన గ్రామ అభివృద్ధి కమిటీ అధ్యక్షులుగా ఎస్‌కే హైమద్, ఉపాధ్యక్షులుగా తోట్ల ఓజన్న, దుర్గం పోషన్న, ప్రధాన కార్యదర్శిగా ముంజ ప్రసాద్, కోశాధికారిగా నీలి ఆరవింద్ ఎన్నికయ్యారు. అనంతరం నూతన అధ్యక్షులు హైమాద్ మాట్లాడుతూ తమపై నమ్మకంతో ఎన్నుకున్న గ్రామ సభ్యులకు ధన్యవాదాలు తెలిపారు. గ్రామ అభివృద్ధికి తమ వంతు సహకారం అందిస్తామన్నారు. కార్యక్రమంలో గ్రామ కమిటీ సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ముమ్మరంగా వాహనల తనిఖీలు



నవతెలంగాణ-ఉట్నూర్

పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో మండల కేంద్రంలోని కొత్తగూడ చెక్‌పోస్ట్ వద్ద వాహనాల తనిఖీలు ముమ్మరంగా చేపట్టారు. బుధువారం ఉట్నూర్ నుండి జన్నారం వెళ్లే వాహనాలను కొత్తగూడ చెక్ పోస్ట్ వద్ద పోలీసులు, ఎన్నికల అధికారులు తనిఖీ చేశారు. కార్యక్రమంలో ఎన్నికల అధికారి రాథోడ్ సోరాజీ, పోలీసులు, అటవీ శాఖ అధికారులున్నారు.

కాంగ్రెస్‌లో చేరిన రిటైర్డ్ హెచ్‌ఎం శంకర్ దంపతులు

నవతెలంగాణ-ఉట్నూర్



మండలంలోని హస్నపూర్ గ్రామానికి చెందిన రిటైర్డ్ హెచ్‌ఎం జాదవ్ శంకర్ సింధుబాయి దంపతులు బుధువారం జిల్లా ఇంచార్జీ మంత్రి సీతక్క సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. ఈ సందర్భంగా వారికి పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్రంలో అమలు చేస్తున్న ఆరు గ్యారంటీ పథకాలకు ఆకర్షితులై పార్టీలో చేరినట్లు తెలిపారు. కాంగ్రెస్ అభ్యర్థి ఆత్రం సుగుణనీ గెలిపించి కేంద్రంలో కాంగ్రెస్ ప్రభుత్వ ఏర్పాటుకు కృషి చేయాలని మంత్రి సీతక్క వారికి సూచించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే వేడ్మ బొజ్జు పటేల్, ఎంపీ అభ్యర్థి ఆత్రం సుగుణ, ఆసిఫాబాద్ నియోజకవర్గం ఇన్‌చార్జి అజ్మీరా శ్యామ్ నాయక్ , మాజీ ఎమ్మెల్యే కోనేరు కొనప్ప, సర్పంచుల సంఘం రాష్ట్ర కార్యదర్శి బానోత్ గజానంద్ నాయక్, నార్నూర్ ఎంపీటీసి పరమేశ్వర్, కాంతరావు డైరెక్టర్, చంద్రయ్య, కొర్రల మహేందర్, ప్రకాష్, ప్రకాష్, అశోక్ పాల్గొన్నారు.

ఉపాధి హామీ చట్టం తెచ్చిందే కాంగ్రెస్

- ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్

నవతెలంగాణ-కడెం

ఉపాధి హామీ చట్టం తెచ్చిందే కాంగ్రెస్ పార్టీయేనని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ అన్నారు. బుధవారం మండలంలోని కల్లెడ గ్రామంలో ఎన్నికల ప్రచారంలో భాగంగా ఉపాధి హామీ కూలీలతో మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం పేదల సంక్షేమానికి పెద్ద పీట వేస్తుందన్నారు. గతంలో కాంగ్రెస్ హయాంలోనే ఎన్ఆర్ఈజీఎస్ పథకాన్ని అమల్లోకి తెచ్చామని తెలిపారు. బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలు ఈ పదేండ్ల పాలనలో ప్రజలకు చేసిందేమి లేదన్నారు. రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో హస్తం గుర్తుకు ఓటేవేసి ఆత్రం సుగుణను భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల సీనియర్ కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలు, పాల్గొన్నారు.

సీపీఐఎంఎల్ ఆధ్వర్యంలో

మండలంలో వకీల్ నగర్, ధర్మాజీపేట్, మాసాయిపేట్ గ్రామాలలో ఇండియా కూటమి అభ్యర్థి ఆత్రం సుగుణ తరపున సీపీఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ ఖానాపూర్ డివిజన్ కమిటీ ఆధ్వర్యంలో కరపత్రాలు పంచుతూ బుధవారం ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా డివిజన్ కార్యదర్శి సునారికారి రాజేష్ మాట్లాడుతూ బీజేపీ పాలనలో రాజ్యాంగం, పార్లమెంటరీ, ప్రజాస్వామ్యం, ప్రజలు, రాష్ట్రాల హక్కులకై దాడులు పెరిగాయన్నారు. మరోసారి నరేంద్ర మోడీ ప్రభుత్వం వస్తే రాజ్యాంగాన్ని మారుస్తారన్నారు. బీజేపీని ఓడించి ఇండియా కూటమి అభ్యర్థి ఆత్రం సుగుణని గెలిపించచి ప్రజాస్వామ్యాన్ని కాపాడాలలచ్చారు. ఈ కార్యక్రమంలో డివిజన్ నాయకులు దుర్గం లింగన్న, ఆకుల సత్యం, దొంగరి కిషన్, బక్కన్న పాల్గొన్నారు.

నచ్చన్ ఎల్లాపూర్‌లో

మండలంలోని నచ్చన్ ఎల్లాపూర్ గ్రామంలో మండల నాయకులు ఉపాధి కూలీల వద్దకు వెళ్లి బుధవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మండల అధ్యక్షులు తుమ్మల మల్లేష్ యాదవ్ మాట్లాడుతూ రాబోయే పార్లమెంట్ ఎలక్షన్ నందు హస్తం గుర్తుకు ఓటు వేసి ఆత్రం సుగుణను భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో నచ్చన్ ఎల్లాపూర్ మాజీ సర్పంచ్ బొడ్డు గంగన్న, సీపీఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ ఖానాపూర్ డివిజన్ కార్యదర్శి సునారికారి రాజేష్, మండల సీనియర్ నాయకులు పడిగల భూషణ్ పాల్గొన్నారు.

ఉట్నూర్ : మండలంలోని శాంతి నగర్, సేవాదాస్ నగర్, బోయవాడ, హస్నాపూర్, వడోని, తదితర గ్రామాల్లో కాంగ్రెస్ నాయకులు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. పార్టీ చేస్తున్న అభివృద్ధి, గ్యారంటి పథకాలను వివరిస్తూ చేతి గుర్తుకు ఓటేయ్యాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు మల్యాల శేఖర్, టేకుల శంకర్, జాదవ్ రాజేష్, ఎర్రదండి సుశీల్ కుమార్ పాల్గొన్నారు.

ఆదిలాబాద్ రూరల్ : ఆదిలాబాద్ జిల్లాకేంద్రంలోని రాంనగర్‌లో తెలంగాణ కిసాన్ కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బోరంచు శ్రీకాంత్ రెడ్డి నాయకులతో కలిసి ప్రచారం నిర్వహించారు. 13న చేతి గుర్తుకు ఓటువేసి సుగుణక్క గెలిపించాలని విన్నవించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ అట్లా గోవర్ధన్ రెడ్డి, కో ఆప్షన్ మెంబర్ కరీం ఖాన్, దామోదర్‌రెడ్డి, నాగరాజు, గణపతి రెడ్డి, కొరటి ప్రభాకర్, ఫెరోజ్ ఖాన్, వెంకటేష్, రెండ్ల రాజన్న, అడెల్లు, గాలిపెల్లి నాగన్న, విశాల్ రెడ్డి, శ్రీకర్ ప్రశాంత్, అనిల్, హక్కీ పాల్గొన్నారు.

తలమడుగు : మండలంలోని మారుమూల గిరిజన గ్రామాలైన రత్నాపూర్, చిన్నపూనగూడ, మందగూడ గ్రామాలలో బుధవారం కాంగ్రెస్ పార్టీ నాయకులు గడపగడపకు ప్రచారం నిర్వహించారు. పార్లమెంటు కాంగ్రెస్ అభ్యర్థి ఆత్రం సుగుణను భారీ మెజార్టీతో గెలిపించాలని ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జడ్పిటిసి గోక గణేష్‌రెడ్డి, మండల కాంగ్రెస్ నాయకులు కళ్యాణం రాజేశ్వర్, మాజీ జడ్పిటిసి బొల్లారం బాబన్న, మాజీ సింగిల్ విండో చైర్మన్ ప్రకాష్‌రావు, మాజీ ఎంపీపీ రాము, ఎంపీటీసీలు వెంకన్న యాదవ్, మాధవ్, మాజీ సర్పంచ్ రఘు, జ్ఞానేశ్వర్, జైరాం, కాంతారావు, దత్తు, శ్రీనివాస్, పోశెట్టి, సూర్యభాను, మోహన్, దేవ్‌రావు పాల్గొన్నారు.

సిరికొండ : ఇచ్చిన హామీలను నెరవేర్చే సత్తా కాంగ్రెస్‌కే ఉందని ఆ పార్టీ నాయకుడు అశ్విన్‌రెడ్డి అన్నారు. బుధవారం మండల కేంద్రంతో పాటు మండలంలోని సుంకిడి, రాయిగూడ గ్రామాలలో ఇంటింటికి తిరుగుతూ ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఆదివాసీ గూడెల్లో ఇప్పటికీ ఇందిరమ్మ ఇండ్లే ఉన్నాయన్నారు. ఇల్లు లేని ప్రతి పేదవాడికి ఇల్లు ఇచ్చే బాధ్యత కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకుందని తెలిపారు. ఆగస్టు 15లోపు రైతులకు రెండు లక్షల రుణమాఫీ చేసి తీరుతుందన్నారు. రాష్ట్ర మరింత అభివృద్ధి పథంలో వెళ్లాలంటే కాంగ్రెస్‌ను గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఇమామ్, నాయకులు ప్రవీణ్, మాధవ్ పటేల్, దేవిదాస్, ఇమామ్ పాల్గొన్నారు.



ఆదిలాబాద్‌టౌన్ : కాంగ్రెస్ అభ్యర్థి ఆత్రం సుగుణ తరపున మాజీ మార్కెట్ కమిటీ చైర్మెన్ సంజీవ్‌రెడ్డి నాయకులతో కలిసి ప్రచారం నిర్వహించారు. బుధవారం పట్టణంలోని వార్డు 39, 40 పరిధిలోని పిట్టవాడ కాలనీలో ఇంటింటికి తిరుగుతూ కరపత్రాలను పంపిణీ చేస్తూ చేతి గుర్తుకు ఓటెయ్యాలని అభ్యర్థించారు. తొలిసారి ఆదిలాబాద్ చరిత్రలో కాంగ్రెస్ మహిళ అభ్యర్థికి టికెట్ ఇచ్చిందని, ఆమెను గెలిపించుకునే బాధ్యత అందరిపై ఉందన్నారు. ఆత్రం సుగుణ ప్రజా సమస్యలపై అవగహన కలిగి ఉన్నారని, అలాంటి వారు పార్లమెంట్‌లో ఉంటే జిల్లాకు న్యాయం జరుగుతుందన్నారు. మే 13న జరిగే ఎన్నికల్లో చేతి గుర్తుకు ఓటేసి గెలిపించాలని అభ్యర్థించారు. ఈ కార్యక్రమంలో నాయకులు అంబకంటి అశోక్, వసీం, వెంకటేష్ పాల్గొన్నారు.

నార్నూర్ : ప్రజాపాలన ముందుకు సాగాలంటే, సంక్షేమ ఫలాలు పొందాలంటే పార్లమెంట్ ఎన్నికల్లో ప్రజలు కాంగ్రెస్ ఎంపి అభ్యర్థి ఆత్రం సుగుణను గెలిపించాలని ఆసిఫాబాద్ నియోజకవర్గ సీనియర్ నాయకులు గణేష్ రాథోడ్ అన్నారు. పార్లమెంట్ ఎన్నికల ప్రచారంలో భాగంగా బుధవారం మండల కేంద్రంలోని మార్కెట్‌లో ప్రచారం చేపట్టారు. కాంగ్రెస్ ప్రభుత్వ ఆరు గ్యారెంటీల కరపత్రాలను అందజేశారు. కాంగ్రెస్ ప్రజల కోసం అమలు చేస్తున్న పథకాలను, అభివృద్ధి పనులను వివరించారు. పోడు భూముల సమస్య పరిష్కారం కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమని పేర్కొన్నారు. మోడీ ప్రభుత్వం చిన్న వ్యాపారులకు జిఎస్టి విధించడంతో పాటు నిత్యావసర వస్తువులు, పెట్రో ధరలు పెంచి పేద, మధ్య తరగతి ప్రజలను, ఆదివాసీ ప్రజలను మోసం చేశారని పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే రాహుల్ గాంధీ ప్రధానిగా ప్రజల సంక్షేమంపై ప్రత్యేక దృష్టి సారిస్తారని తెలిపారు. కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి ఆత్రం సుగుణను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. ప్రచారంలో వారి వెంట నాయకులు కరీమ్‌ఖాన్, యూసుఫ్‌ఖాన్, మాణిక్‌రావ్ ఆడే, సంతోష్ పటేల్, గోవింద్‌రావ్, హరిచంద్ నాయక్, రాజు ఉన్నారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
కుమురంభీం ఆసిఫాబాద్
గురువారం | మే 09, 2024 | www.navatelangana.com

జాతీయ చేనేత అవార్డుకు దరఖాస్తులు

నవతెలంగాణ-ఆసిఫాబాద్

2023 సంవత్సరానికి గాను జాతీయ చేనేత అభివృద్ధి కార్యక్రమం క్రింద సంత్ కబీర్, జాతీయ చేనేత అవార్డుకు అర్హత గల అభ్యర్థుల నుండి దరఖాస్తుల స్వీకరిస్తున్నట్లు చేనేత, జౌళి, దుస్తుల ఎగుమతి శాఖ సంచాలకులు డా. అలుగు వర్షిని ఒక ప్రకటనలో పేర్కొన్నారు. చేనేత రంగం, డిజైన్ డెవలప్‌మెంట్, ఎన్‌హెచ్‌డీపీ క్రింద చేనేత ఉత్పత్తుల మార్కెటింగ్ రంగంలో తమ అత్యుత్తమ గుర్తింపు కోసం చేనేత నేత కార్మికులు, డిజైనర్లు, విక్రయదారుల నుండి ఈనెల 20వ తేదీ వరకు దరఖాస్తులు స్వీకరించడం జరుగుతుందని తెలిపారు. అవార్డుల కోసం నేత విభాగంలో విజేతలను 3 అంచెల ఎంపిక ప్రక్రియ (జోనల్, హెడ్ క్వార్టర్, జాతీయస్థాయి ఎంపిక కమిటీ) ప్రవేశాల ఎంపిక ద్వారా ఖరారు చేయడం జరుగుతుందన్నారు. దరఖాస్తు ప్రక్రియ, మార్గదర్శకాలు, ఇతర వివరాలకు ఆన్‌లైన్‌లో డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.హ్యాండ్‌లుమ్స్.ఎన్ఐసీ.ఇన్ వెబ్‌సైట్‌లో సంప్రదించవచ్చుని, ఫిజికల్ దరఖాస్తును నిర్ణీత సమయంలోగా వీవర్ సర్వీస్ సెంటర్, హైదరాబాద్‌లో సమర్పించాలన్నారు.

పోయిన సెల్‌ఫోన్ అప్పగింత

నవతెలంగాణ-ఆసిఫాబాద్



జిల్లా కేంద్రంలో గతంలో వేరువేరు ప్రాంతాల్లో పోయిన రెండు సెల్‌ఫోన్లను సీఐ సతీష్ బాధితులకు అప్పగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా కేంద్రానికి చెందిన బోయిన తిరుపతి డిసెంబర్‌లో, పోలగని రాజన్న మార్చి నెలలో తమ సెల్ ఫోన్లను పోగొట్టుకున్నట్లు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారని తెలిపారు. వారి ఫిర్యాదు మేరకు సెయిర్ పోర్టల్ ద్వారా పోయిన ఫోన్లను గుర్తించి బాధితులకు ఇచ్చినట్లు తెలిపారు. సెల్‌ఫోన్ పోయినట్లయితే ఐఎమ్ఈఐ నెంబర్ ద్వారా ట్రేస్ చేయొచ్చుని, మొబైల్ ట్రేస్ అవుట్ చేయడంలో సిబ్బంది రుకియా సుల్తానా సహకరించినట్లు తెలిపారు.

పోస్టల్ బ్యాలెట్ల గడువు పెంపు

- కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే



నవతెలంగాణ-ఆసిఫాబాద్

పార్లమెంట్ ఎన్నికల్లో భాగంగా పోస్టల్ బ్యాలెట్ల కోసం దరఖాస్తు చేసుకున్న వారికి ఈనెల 10వ తేదీ వరకు దరఖాస్తు గడువు పెంచినట్లు కలెక్టర్ వెంకటేష్ ధోత్రే తెలిపారు. పోస్టల్ బ్యాలెట్ కోసం ఆసిఫాబాద్ నియోజక వర్గం నుండి 2420 మంది ఉద్యోగులు దరఖాస్తు చేసుకోగా బుధవారం వరకు 2039 మంది ఉద్యోగులు ఓటుని వినియోగించుకున్నారు. సిర్పూర్ నియోజకవర్గంలో 1415 మంది ఉద్యోగులు దరఖాస్తు చేసుకోగా 1246 మంది ఓటుహక్కుని వినియోగించుకున్నారు. పోస్టల్ బ్యాలెట్ ఓటుని వినియోగించుకోని వారు మరో రెండు రోజులు అవకాశం ఉన్నందున సద్వినియోగం చేసుకోవాలన్నారు. సిర్పూర్, ఆసిఫాబాద్ నియోజకవర్గాల్లోని వృద్ధులు, దివ్యాంగులు ఇంటి నుండే ఓటు హక్కుని వినియోగించుకున్నారని, సిర్పూర్‌లో 127 మంది దరఖాస్తు చేసుకోగా 122 మంది, ఆసిఫాబాద్ నియోజకవర్గంలో 29 మందిలో 29 మంది తమ ఓటు వేశారు.

పోస్టల్ బ్యాలెట్ ఓటు వేసిన అదనపు కలెక్టర్

అదనపు కలెక్టర్ దీపక్ తివారి జిల్లా కేంద్రంలోని ఆర్డీఓ కార్యాలయంలో పోస్టల్ బ్యాలెట్ ఓటు హక్కు వినియోగించుకున్నారు. ఎన్నికల విధులు నిర్వహించే ఉద్యోగి పోస్టల్ బ్యాలెట్ ఓటు హక్కు వినియోగించుకోవాలని కోరారు.

లక్ష్యాన్ని నిర్దేశించుకుని చదువుకోవాలి

- నవోదయ ప్రిన్సిపల్ చక్రపాణి



నవతెలంగాణ-కాగజ్‌నగర్

విద్యార్థులు స్పష్టమైన లక్ష్యాన్ని నిర్దేశించుకుని చదువుకోవాలని జవహర్ నవోదయ ప్రిన్సిపల్ చక్రపాణి సూచించారు. పట్టణంలో నిర్వహిస్తున్న ఉచిత పాలిటెక్నిక్ శిక్షణ శిబిరాన్ని బుధవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థుల ఉద్దేశించి మాట్లాడుతూ విద్యార్థులు ఒక లక్ష్యాన్ని నిర్దేశించుకుని చదువుకోవాలన్నారు. చదువుకునే నిరుపేద విద్యార్థులకు ప్రభుత్వం, స్వచ్ఛంద సంస్థల ద్వారా వివిధ అవకాశాలున్నాయని తెలిపారు. విద్యార్థులు ఉన్నత విద్య చదవడానికి కేంద్ర ప్రభుత్వ, పాలిటెక్నిక్ కళాశాల గురించి వివరించారు. కోర్సులను ఎన్నుకొని తమ విద్యాభ్యాసం పూర్తి చేసుకోవచ్చుని పేర్కొన్నారు. కార్యక్రమంలో శిక్షణ కేంద్రం కోఆర్డినేటర్ కటుకం మధుకర్, మామిడాల శ్రీశైలం, తవటం శ్యాంసుందర్, రాజ్ కమలాకర్ రెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వ్యాపారి అదృశ్యం

నవతెలంగాణ-కాగజ్‌నగర్

కాగజ్‌నగర్ పట్టణానికి చెందిన ఫైనాన్స్ వ్యాపారి నాగమల్ల సురేష్ ఈ నెల 6న అదృశ్యమైనట్లు టౌన్ ఎస్ఐ అంజయ్య తెలిపారు. చిట్ ఫండ్ వ్యాపారం నిర్వహించే సురేష్ ఇతరుల నుండి డబ్బులు తీసుకోగా, వారి నుండి డబ్బులు తిరిగి ఇవ్వాలని ఒత్తిళ్లు వస్తున్నాయి. ఈ ఒత్తిళ్లు తట్టుకోలేక 6న ఇంట్లో నుండి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. 7న భార్య అన్నపూర్ణ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్ఐ అంజయ్య తెలిపారు.

మిగిలింది మూడు రోజులే

- ఎన్నికల ప్రచారానికి సమీపిస్తున్న గడువు
- ముగిసిన కాంగ్రెస్, బీజేపీ అధినేతల పర్యటనలు
- 9న ఆసిఫాబాద్‌లో కేటీఆర్ బహిరంగసభకు ఏర్పాట్లు

ఈ నెల 13న జరిగే లోక్‌సభ ఎన్నికల ప్రచార సమాప్తికి ఇక మూడు రోజులే మిగిలింది. ఈ ఎన్నికల ప్రచారం 11వ తేదీ సాయంత్రం ఐదు గంటలతో ముగియనుంది. ఈ మూడు రోజుల వ్యవధిలో అన్ని పార్టీల నాయకులు తమ ప్రచారాన్ని మరింత ఉధృతం చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేశారు. ఇప్పటికే కాంగ్రెస్, బీజేపీ అధినేతలు జిల్లాలోని రెండు నియోజకవర్గాలలో పర్యటించి వెళ్లగా, ఈ నెల తొమ్మిదో తేదీన బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆసిఫాబాద్‌కు రానుండటం ప్రాధాన్యం సంతరించుకుంది.

నవతెలంగాణ-కాగజ్‌నగర్

కుమురం భీం ఆసిఫాబాద్ జిల్లాలోని ఆసిఫాబాద్, సిర్పూరు నియోజకవర్గాలలో లోక్‌సభ ఎన్నికల ప్రచారం హోరాహోరీగా సాగుతోంది. ఆదిలాబాద్ పార్లమెంట్ స్థానం పరిధిలోకి వచ్చే ఈ రెండు స్థానాలలో కూడా వివిధ పార్టీల నాయకులు ముమ్మర ప్రచారం చేపట్టారు. లోక్‌సభ బరిలో ఈ స్థానం నుండి 12 మంది అభ్యర్థులు బరిలో ఉన్నా ప్రధానంగా కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీల మధ్యే పోటీ నెలకొని ఉంది. కాంగ్రెస్ అభ్యర్థి ఆత్రం సుగుణ తరపున సీఎం రేవంత్‌రెడ్డి ఆసిఫాబాద్‌కు వచ్చి ప్రచారం చేపట్టారు. బీజేపీ అభ్యర్థి గొడం నగేష్ తరపున ఆ పార్టీ అగ్రనేత అమిత్‌షా కాగజ్‌నగర్‌లో నిర్వహించిన ఎన్నికల ప్రచార సభలో పాల్గొన్నారు. ఇద్దరు అధినేతల బహిరంగసభలు విజయవంతం కావడంతో రెండు పార్టీల శ్రేణుల్లో ఉత్సాహం నెలకొంది. ఈ రెండు పార్టీలకు చెందిన స్థానిక నేతలు కూడా ప్రతిరోజు ముమ్మర ప్రచారం చేపడుతున్నారు. కాంగ్రెస్ అభ్యర్థి ఆత్రం సుగుణ కోసం జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి సీతక్క పలు పర్యాయాలు ఈ రెండు నియోజకవర్గాలలో పర్యటించి ప్రచార సభలలో పాల్గొన్నారు. ఆసిఫాబాద్ నియోజకవర్గంలో డీసీసీ అధ్యక్షులు కొక్కిరాల విశ్వప్రసాద్‌రావు, ఆ నియోజకవర్గ ఇన్‌ఛార్జి శ్యాంనాయక్, మాజీ ఎంపీపీ బాలేష్‌గౌడ్ తదితరులు ఆత్రం సుగుణ కోసం ప్రచారం చేపడుతుండగా, సిర్పూరు నియోజకవర్గంలో నియోజకవర్గ ఇన్‌ఛార్జి రావి శ్రీనివాస్‌తో పాటు జెడ్పీ వైస్ ఛైర్మన్ కోనేరు కృష్ణారావు, మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్పలు ప్రచారం చేపడుతున్నారు. తాజాగా బుధవారం మంత్రి సీతక్క సిర్పూరు నియోజకవర్గంలో పర్యటించి ఆయా ప్రచార సభలలో పాల్గొన్నారు. ఇక బీజేపీ అభ్యర్థి గొడం నగేష్ తరపున ఆ పార్టీ జిల్లా అధ్యక్షులు డాక్టర్ కొత్తపల్లి శ్రీనివాస్ ముమ్మర ప్రచారం చేపడుతున్నారు. ఆసిఫాబాద్ నియోజకవర్గంలో కొత్తపల్లి శ్రీనివాస్‌తో కలిసి ఇటీవలే పార్టీలో చేరిన జెడ్పీటీసీ అరిగెల నాగేశ్వర్‌రావు ప్రచారంలో పాల్గొంటున్నారు. సిర్పూరు నియోజకవర్గంలో స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ పాల్వాయి హరీష్‌బాబు ప్రతీ రోజు ఆయా మండలాల్లో ఏర్పాటు చేసిన ప్రచార సభలలో పాల్గొంటున్నారు. ఈ నెల పదో తేదీన బీజేపీ రాష్ట్ర నాయకుడు చీకోటి ప్రవీణ్ కాగజ్‌నగర్‌లో ప్రచారానికి రానున్నారని ఎమ్మెల్యే పాల్వాయి హరీష్‌బాబు తెలిపారు.

బీఆర్ఎస్‌కు అన్నీ తామై...

ఇక భారత రాష్ట్ర సమితి అభ్యర్థి ఆత్రం సక్కుకు ఎమ్మెల్సీ దండె విఠల్‌తో పాటు ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మిలు అన్నీ తామై ఎన్నికల ప్రచారంలో పాల్గొంటున్నారు. ఆసిఫాబాద్ నియోజకవర్గంలో ఎమ్మెల్యే కోవ లక్ష్మి ప్రచారంలో పాల్గొంటుండగా, సిర్పూరు నియోజకవర్గంలో ఎమ్మెల్సీ దండె విఠల్ ప్రచారం చేపడుతున్నారు. ఈ పార్టీ నుండి ఇప్పటి వరకు రాష్ట్ర నాయకత్వం ప్రచారానికి రాలేదు. కాని తొమ్మిదో తేదీన పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆసిఫాబాద్‌కు రానున్నారు. స్థానికంగా నిర్వహించే ఎన్నికల ప్రచార సభలో ఆయన పాల్గొననున్నారు. కాగజ్‌నగర్‌లో నిర్వహించిన ఎన్నికల ప్రచార సభకు నాగర్‌కర్నూల్ ఎంపీ అభ్యర్థి ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ ఒక పర్యాయం వచ్చి వెళ్లారు. అంతే తప్ప పెద్దగా రాష్ట్ర నాయకులు ఎవరూ ప్రచారానికి రాలేదు. కాగజ్‌నగర్‌లో సిర్పూరు పేపర్ మిల్లు పున:ప్రారంభంలో బీఆర్ఎస్ ప్రభుత్వ కృషి ఉన్నందున కేటీఆర్‌ను కాగజ్‌నగర్‌కు కూడా రప్పించి బహిరంగసభ ఏర్పాటు చేయాలనే ఆలోచనలో ఎమ్మెల్సీ దండె విఠల్ ఉన్నట్లు తెలుస్తోంది. బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి ఆత్రం సక్కు కూడా పెద్దగా ఈ రెండు నియోజకవర్గాలలో పర్యటించకపోవడం ఆ పార్టీ శ్రేణులను నిరాశకు గురి చేస్తోంది.



ఆసిఫాబాద్ ఎన్నికల ప్రచార సభలో పాల్గొన్న సీఎం రేవంత్‌రెడ్డి (ఫైల్)



కాగజ్‌నగర్‌లో నిర్వహించిన ఎన్నికల ప్రచారసభలో అమిత్‌షా (ఫైల్)

ఇండియా కూటమి అభ్యర్థిని గెలిపిద్దాం

- సీపీఐ(ఎం) నియోజకవర్గ కన్వీనర్ దుర్గం దినకర్



రెబ్బెనలో ప్రచారం నిర్వహిస్తున్న సీపీఐ(ఎం) నాయకులు

నవతెలంగాణ-రెబ్బెన

ఇండియా కూటమి బలపరిచిన కాంగ్రెస్ అభ్యర్థి ఆత్రం సుగుణను భారీ మెజార్టీతో గెలిపించాలని సీపీఐ(ఎం) ఆసిఫాబాద్ నియోజకవర్గ కన్వీనర్ దుర్గం దినకర్ అన్నారు. బుధవారం మండలంలోని రాంపూర్, నవేగాం, రాళ్ళపేట, బుద్దనగర్, పుంజుమేర గూడ గ్రామాలలో కాంగ్రెస్ అభ్యర్థి ఆత్రం సుగుణ తరపున ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేద ప్రజలకోసం, వారి పక్షాన, కార్మికులు, వ్యవసాయ కార్మికుల, కూలీల పక్షాన ఎర్రజెండా నిలుస్తుందన్నారు. భూపోరాటాలు చేసి వందల ఎకరాలు పేదలకు పంచిన చరిత్ర సీపీఐ(ఎం) ఉందన్నారు. మతం పేరుతో ఓట్లు అడుగుతున్న బీజేపీనీ ఓడించాలన్నారు. ఇండియా కూటమి భాగస్వామి కాంగ్రెస్ అభ్యర్థి ఆత్రం సుగుణ చేతి గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు గేడం టీకనంద్, చాపిడి పురుషోత్తం, సతిష్, నిఖిల్, తిరుపతి, మాలశ్రీ, శ్రావణి, శ్రీకాంత్, శివ పాల్గొన్నారు.

ఆసిఫాబాద్ : బీజేపీ ఆర్ఎస్ఎస్ ఉమ్మడి మోడీ ఫాసిజానికి వ్యతిరేకంగా పోరాడుతూనే ఇండియా కూటమి అభ్యర్థినీ గెలిపించాలని సీపీఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ జిల్లా కార్యదర్శి చాంద్ పాషా అన్నారు. మండలంలోని వెంకటాపూర్, పర్వతిపూర్, బలంపూర్ గ్రామాల్లో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మోడీ 10 ఏండ్ల పాలనలో దేశవ్యాప్తంగా హిందుత్వ ఫాసిస్టు శక్తులు పెట్రేగిపోయాయని, దళితులు, ఆదివాసులు, మహిళలు, మైనారిటీలపైన దాడులు, హింస పెరిగాయన్నారు. క్రిస్టియన్, మైనారిటీ మతాలకు వ్యతిరేకంగా హిందూ మతోన్మాదాన్ని రెచ్చగొడుతూ దేశ సమైక్యతకు, లౌకిక, ప్రజాస్వామిక విధానాలకు తూట్లు పొడుస్తు హిందువుల సంపదను కార్పొరేట్లకు దోచి పెడుతూ హిందువుల్ని మతం మత్తులో ముంచుతుందన్నారు. ఒక వర్గానికి తాము ఏమో చేస్తున్నట్లు నమ్మ పలుకుతూ గతంలో ఇచ్చిన హామీలు తుంగలో తొక్కుతోందన్నారు. అన్ని వర్గాలను మోసం చేసిన బీజేపీని ఓడించాలన్నారు. కార్యక్రమంలో పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి బౌరే కళ్యాణ్, జగజంపుల తిరుపతి, ఏఐకేఎంఎస్ జిల్లా కన్వీనర్ రత్నం పోషన్న, ఐఎఫ్‌టీయూ జిల్లా మాయకులు బండారి తిరుపతి, పీడీఎస్‌యూ జిల్లా నాయకులు శ్యామ్, తిరుపతి, గ్రామ నాయకులు రవీందర్, బాలాజీ, కొటేశ్వర్, రమేష్, జైరాం, వెంకటేష్, నగేష్ పాల్గొన్నారు.

పెంచికల్‌పేట్ : ఆదిలాబాద్ పార్లమెంట్ అభ్యర్థి ఆత్రం సుగుణను గెలిపించాలని కాంగ్రెస్ నాయకులు అన్నారు. మండలంలోని దరోగపెల్లి, ఎలుకపెల్లి, ఎల్లూరు గ్రామాల్లో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మే 13న చేతి గుర్తుకు ఓటేసి ఆత్రం సుగుణక్కను గెలిపించాలని అభ్యర్థించారు. కార్యక్రమంలో మండల కోఆప్షన్ సభ్యుడు సాజిద్, నాయకులు సముద్రాల రాజన్న, రమేష్, గణపురం బాపూజీ, మాజీ సర్పంచ్ దేవాజీ పాల్గొన్నారు.



ఉపాధి కూలీలతో నినాదాలు చేస్తున్న సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసి నాయకులు

అంబేద్కర్ ఆశయాలకు అనుగుణంగా పనిచేస్తాం

- సిర్పూర్ ఎమ్మెల్యే పాల్వాయి హరీష్ బాబు



నవతెలంగాణ-కాగజ్‌నగర్ రూరల్

రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ రచించిన రాజ్యాంగ స్ఫూర్తికి అనుగుణంగా బీజేపీ పనిచేస్తోందని సిర్పూర్ ఎమ్మెల్యే పాల్వాయి హరీష్ బాబు అన్నారు. మంగళవారం రాత్రి మండలంలోని చింతగూడ గ్రామంలో బీజేపీ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ పీఎం మోదీ నాయకత్వంలో దేశం ముందుకు పోవడానికి చోదక శక్తిగా పనిచేస్తుందని తెలిపారు. రిజర్వేషన్ విషయంలో అనవసర అపోహలు సృష్టిస్తున్నారు, వాటిని ప్రజలు ఎవరూ నమ్మవద్దని, రాబోయే రోజులలో రిజర్వేషన్ తగ్గింపు ఆలోచన ఏమాత్రం లేదని స్పష్టం చేశారు. వందలకును నమ్ముకుంటూ దేశం కోసం ధర్మం కోసం పనిచేసే నరేంద్ర మోదీ నాయకత్వాన్ని బలపర్చాలని కోరారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు కొత్తపల్లి శ్రీనివాస్ పాల్గొన్నారు.

మార్నింగ్ వాక్‌లో ఎమ్మెల్సీ ప్రచారం



నవతెలంగాణ-కాగజ్‌నగర్

ఆదిలాబాద్ పార్లమెంట్ బీఆర్ఎస్ అభ్యర్థి ఆత్రం సక్కు గెలుపు కోసం ఎమ్మెల్సీ దండె విఠల్ ప్రచారం చేపడుతున్నారు. ఇందులో భాగంగా బుధవారం కాగజ్‌నగర్‌లోని ఎస్పీఎం క్రీడా మైదానంలో వాకర్స్‌ను కలిశారు. అనంతరం అంబేద్కర్ చౌరస్తాకు వచ్చి అక్కడ నాయకులు, అభిమానులు, కార్యకర్తలతో కలిసి ఛాయ్ తాగుతూ రాజకీయాల గురించి చర్చించారు. ఈ సందర్భంగా పలువురు పాత మిత్రులను ఎమ్మెల్సీ కలిసి వారితో మాట్లాడారు. ఈ నెల 13న జరిగే పార్లమెంట్ ఎన్నికలలో ఆత్రం సక్కుకు ఓటు వేయాలని ఈ సందర్భంగా ఎమ్మెల్సీ వారిని కోరారు.

పెంచికల్‌పేట్ : మండలంలోని ఎలుకపెల్లి గ్రామంలో ఆదిలాబాద్ పార్లమెంట్ బీఆర్ఎస్ అభ్యర్థి ఆత్రం సక్కుకు మద్ధతుగా నాయకులు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. గత పది సంవత్సరాల కాలంలో బీఆర్ఎస్ ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలు చేపట్టిందన్నారు. కారు గుర్తుకు ఓటు వేసి ఆత్రం సక్కును భారీ మెజార్టీతో గెలిపించాలన్నారు. కార్యక్రమంలో నాయకులు రాచకొండ కృష్ణ, నగునూరి శ్రీనివాస్, శంకర్‌గౌడ్, ఆనంద్ పాల్గొన్నారు.

ప్రభుత్వం ఆదుకోవాలి

నవతెలంగాణ-సిర్పూర్(టి)



మండలంలోని చింతకుంట గ్రామానికి చెందిన చీపెల్లి ప్రకాష్ అనే వ్యక్తికి సంబంధించిన ఇంటికి చుట్టుప్రక్కల ఉన్న మట్టి గోడలు నిన్న రాత్రి కురిసిన భారీ వర్షానికి తడిసి కూలిపోయాయి. పైకప్పు రేకులు వేసుకొని చుట్టూ మట్టి గోడలతో ఇంటిని నిర్మించుకున్నాడు. మంగళవారం రాత్రి కురిసిన వర్షంతో గోడలు కూలిపోవడంతో రాత్రంతా బిక్కుబిక్కుమంటూ కుటుంబ సభ్యులతో ఇంటిలోనే ఉన్నారు. ప్రభుత్వం స్పందించి ఆదుకోవాలని బాధితుడు ప్రకాష్ కోరుతున్నారు.

రేషన్ బియ్యం అక్రమ రవాణా

- లబ్ధి పొందేదెవరు..?
- పరిశ్రమలు లేక పెరుగుతున్న నిరుద్యోగ యువత
- బడా వ్యాపారులను వదిలి చిన్నవారిపై జులుం

నవతెలంగాణ-సిర్పూర్(టి)

పేదల కోసం ప్రభుత్వాలు పంపిణీ చేస్తున్న రాయితీ బియ్యం పక్కదారి పడుతోంది. కొందరు జీవనం కోసం వాటిని అమ్ముకుంటుంటే మరి కొందరు వారి అవసరాలను ఆసరాగా చేసుకోని అధిక ధరలకు అమ్ముతూ సొమ్ము చేసుకుంటున్నారు. వీటిని అరకట్టాల్సిన అధికారులు బడా వ్యాపారులను వదిలి చిన్నచితకగా జీవనం సాగించేందుకు విక్రయించే వారిపై దాడులు నిర్వహించి పట్టుకుంటున్నారు. బియ్యం అక్రమంగా విక్రయించడం నేరామైనప్పటికి కుటుంబ పోషణకు తప్పడం లేదనే వాదనలు వినిపిస్తున్నాయి. ఉపాధి, ఉద్యోగం లేక యువకులు, ఇతరులు రేషన్ బియ్యన్ని పక్కన ఉన్న మహారాష్ట్రలో విక్రయిస్తున్నారు. భూములు లేక ఉపాధి కరువై ప్రభుత్వం పేద ప్రజలకు పంపిణీ చేసే బియ్యాన్ని మన రాష్ట్రానికి సరిహద్దు రాష్ట్రమైన మహారాష్ట్రకు ద్విచక్ర వాహనాలపై తీసుకెళ్లి వారి కుటుంబాలతో మధ్య స్థాయిలో జీవనం కొనసాగిస్తున్నారు.

మహారాష్ట్రలో ప్రత్యేక దుకాణాలు

రాష్ట్రానికి ఆనుకొని ఉన్న మహారాష్ట్రలోని పోడ్సా గ్రామంలో రేషన్ బియ్యాన్ని కొనుగోలు చేయడానికి ప్రత్యేకంగా మహారాష్ట్ర వారు కొంతమంది దుకాణాలు ఏర్పాటు చేశారు. ఈ దుకాణాలకే మన రాష్ట్ర రేషన్ బియ్యం నిరుద్యోగులు తీసుకెళ్తుంటారు. వీరిని ఆసరాగా చేసుకొని రాజకీయ పలుకుబడి కలిగిన కొంతమంది వ్యక్తులు కూడా అమ్ముకుంటారు. ఈ రేషన్ బియ్యం గ్రామాల్లోని వినియోగదారుల నుండి ఇంటికి తీసుకోక రేషన్ డీలర్‌కే అమ్ముకుంటున్నారు. వీరి వద్దనే రేషన్ బియ్యం సేకరిస్తారు. బియ్యాన్ని తరలించే ద్విచక్ర వాహనాల నిరుద్యోగులు వీరి వద్ద కొనుగోలు చేస్తారు. పలుకుబడి కలిగిన వ్యక్తులు కూడా వీరి వద్దనే సేకరించి ఐచర్, బొలోరో వాహనాల్లో తీసుకెళ్లి పెద్ద మొత్తంలో సొమ్ము చేసుకుంటున్నారు.

బియ్యం అక్రమ రవాణాకు కారణమేంటి..?

వీరందరు ఈ అక్రమ రవాణా దందాకు పాల్పడడానికి ప్రధాన కారణం పది సంవత్సరాల బీఆర్ఎస్ ప్రభుత్వ పరిపాలనలో ప్రభుత్వ శాఖలో వివిధ స్థాయిల్లో ఏర్పడిన ఖాళీలను భర్తీ చేయకపోవడం. ఎంతోకొంత చదువుకున్న నిరుద్యోగులు ఉపాధి దొరకక, నియోజకవర్గంలో పరిశ్రమలు లేక నిరుద్యోగులు ఇలాంటి మార్గాలను ఎంచుకుంటున్నారనే వాదనలు కూడా వినిపిస్తున్నాయి. చేయడానికి పని లేక కుటుంబాన్ని పోషించడానికి ఇలా అక్రమ మార్గం పట్టినట్టు తెలుస్తోంది.

అధికారుల నిఘా వైఫల్యం...

రేషన్ బియ్యం అక్రమ రవాణ కొన్ని రోజుల నుండి కొనసాగుతున్నా నివారించడంలో సంబంధిత శాఖ అధికారులు విఫలమయ్యారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. ప్రతి నెల ప్రభుత్వం ప్రజలకు పంపిణీ చేసే రేషన్ దుకాణాల్లో ఎప్పటికప్పుడు నిల్వలను పంపిణీ చేయకపోవడం, ఎవరైన సామాన్యులు ఫిర్యాదు చేస్తే తప్పా అధికారుల్లో చలనం రాదు. ద్విచక్ర వాహనాలపై రేషన్ బియ్యాన్ని తీసుకెళ్లే నిరుద్యోగులను పట్టుకొని మామూళ్లు ఇస్తేనే వదిలేస్తారు లేకపోతే కేసులు పెట్టి వారి ప్రతాపం చూపిస్తారు. కానీ రాజకీయ పలుకుబడి కలిగిన వ్యక్తులపై మాత్రం సుముఖతగా ఉంటున్నారని సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఇప్పటికైనా సంబంధిత శాఖ అధికారులు స్పందించి రేషన్ బియ్యం అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేయాలని కోరుతున్నారు.

ప్రభుత్వం స్పందించాలి...

రాష్ట్రంలో నూతనంగా ఏర్పడిన ప్రభుత్వం, నియోజకవర్గంలో ఉన్న నాయకులు ఈ ప్రాంతంలో చిన్న, మధ్యతరహా పరిశ్రమలను ఏర్పాటు చేసి ఉద్యోగాలు కల్పించాలి. స్వయం ఉపాధి చేసుకొనే విధంగా నిరుద్యోగ యువతి, యువకులకు సబ్సిడీ రుణాలు ఇవ్వాలని, లేకపోతే నియోజకవర్గంలో ఇప్పటివరకు రేషన్ బియ్యం అక్రమ రవాణ కాకుండా ఇతర మారక ద్రవ్యాలు అక్రమ రవాణాకు అడ్డాగా మారబోతుందనే భయం కూడా ఉంది. ప్రభుత్వం స్పందించి ఈ ప్రాంతంలో ఉన్న నిరుద్యోగులను ఆదుకోవాల్సిన అవసరం ఉంది.



ద్విచక్ర వాహనదారుల వద్ద పట్టుకున్న పీడీఎస్ రైస్

మామిడి పంట నష్టం అంచనా



నవతెలంగాణ-తాండూర్

బెల్లంపల్లి ఉద్యానవన క్లస్టర్ పరిధిలోని తాండూర్ నెన్నెల, భీమిని, కన్నెపెల్లి, వేమనపల్లి మండలాల్లో బుధవారం ఉద్యానవన శాఖ అధికారి సుప్రజ పంట నష్టం అంచనా వేశారు. అవడం, చిత్తాపూర్, కొత్తూరు, నెన్నెలా గ్రామాలకు చెందిన 30 మంది రైతులకు చెందిన మామిడి తోటలను ఆమె పరిశీలించారు. నియోజకవర్గ పరిధిలో మొత్తం 37.20 ఎకరాల్లో 33 శాతం కంటే తక్కువ మామిడి పంట నష్టం జరిగినట్లు ఆమె తెలిపారు. పంట నష్టం నివేదికను ప్రభుత్వానికి పంపించనున్నట్లు ఆమె వివరించారు.

గాండ్ల సమ్మయ్యకు పలు సంఘాల మద్దతు

నవతెలంగాణ-రామకృష్ణాపూర్



బీఆర్ఎస్ పట్టణ ఇన్‌చార్జి గాండ్ల సమ్మయ్య మంగళవారం పార్టీకి, ఇన్‌చార్జి పదవికి రాజీనామా చేసి కాంగ్రెస్‌లో చేరుతున్నారని ప్రకటించారు. ఈ సందర్భంగా బుధవారం ఆయనకు పలు కుల సంఘాలు, వృత్తి సంఘాలు ఏకగ్రీవంగా మద్దతు తెలిపి ఆయా సంఘాల నాయకులు సమ్మయ్య స్వగృహంలో మర్యాదపూర్వకంగా కలిసి పార్టీని మారనున్న సందర్భంగా శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం శాలువాతో సత్కరించారు. చెన్నూర్ కాంగ్రెస్ ఎమ్మెల్యే వివేక్ సమక్షంలో గాండ్ల సమ్మయ్య గురువారం చేరనున్న సందర్భంగా తామంతా ఆయన వెంటే ఉంటూ, తన అడుగుజాడల్లో నడుస్తామని తెలిపారు.

నెలాఖరుకల్లా పనులు పూర్తి చేయాలి

- మంచిర్యాల డీఈఓ ఎస్ యాదయ్య



నవతెలంగాణ-కాసిపేట

పాఠశాలల్లో చేపడుతున్న అభివృద్ధి పనులు ఈ నెల 31వ తేదిలోపు పూర్తి చేయాలని డీఈఓ ఎస్ యాదయ్య ఆదేశించారు. బుధవారం మండలంలోని ఆయా పాఠశాలల్లో అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీల ద్వారా చేపట్టిన పనులను ఆయన పరిశీలించారు. ఈ సంధర్భంగా గోండుగూడ, మహేంద్ర బస్తీ, చింతగూడ, గురువాపూర్ ప్రైమరీ పాఠశాలలతో పాటు తెలంగాణ మోడల్ స్కూల్, కస్తూర్బా విద్యాలయంలో పనులను పరిశీలించి పలు సూచనలు చేశారు. ఈ సంధర్భంగా డీఈఓ యాదయ్య మాట్లాడుతూ నాణ్యతతో కూడిన పనులు చేపడుతూ ఈ నెలలోపు పూర్తి చేయాలని అమ్మ ఆదర్శ కమిటీ చైర్మన్లకు, పాఠశాలల హెచ్ఎంలకు ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా సెక్టోరల్ అధికారి చౌదరి, మోడల్ ప్రిన్సిపాల్ అందె నాగ మల్లయ్య, హెచ్ఎం వేణుమాదవ్ పాల్గొన్నారు.

ఘనంగా బీరన్న పండగ ఉత్సవాలు



నవతెలంగాణ-తాండూర్

మండలంలోని ద్వారకాపూర్ గ్రామంలో వారం రోజుల పాటు బీరన్న పండగ ఉత్సవాలను నిర్వహిస్తున్నారు. బుధవారం నాగవెల్లి కార్యక్రమంలో భాగంగా యాదవులు బోనాలతో డోలు వాయిద్యాల మధ్య బీరన్న గుడి వద్ద ఉత్సవాలు నిర్వహించారు. తొమ్మిది రోజుల పాటు జరిగే బీరన్న కొలుపు ఉత్సవాల్లో ఒగ్గు కథలు, లింగాలు తీయడం, నాగవెల్లి కళ్యాణం, అన్నదాన కార్యక్రమాలు నిర్వహిస్తారు. బీరన్న ఆలయం వద్ద బుధవారం బీఆర్ఎస్ గ్రామ కమిటీ అధ్యక్షుడు ఎల్లాకుల రవికుమార్ దంపతులు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ ఉత్సవాల్లో కాసిపేట, బోయపల్లి, బర్లగూడెం, ద్వారకాపూర్ గ్రామస్తులు, మాసాడి హరికృష్ణ, చంద్రగిరి శ్రీనివాస్, ఎల్లాకుల సురేష్, వేల్పుల మల్లేష్, పుర్ర రాగులయ్య, మాజీ ఉపసర్పంచ్, పుర్ర శేఖర్ పాల్గొన్నారు.

ఆదిలాబాద్ ఎంపీగా ఆత్రం సక్కును గెలిపించాలి

నవతెలంగాణ-జన్నారం

పార్లమెంటులో తెలంగాణ ప్రజల తరపున, ప్రశ్నించే గొంతుక అయిన బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి ఆత్రం సక్కును గెలిపించాలని, ఆ పార్టీ మండల అధ్యక్షుడు గుర్రం రాజారాం రెడ్డి, ప్రధాన కార్యదర్శి సులువ జనార్ధన్, ఫోన్కల్ మాజీ ఉప సర్పంచ్ బాలసాని శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. బుధవారం మండలంలోని, ఫోన్కల్ మేజర్ గ్రామపంచాయతీ పరిధిలోని పాత పుట్టి గూడా, కొత్త పుట్టి గూడా, గిరిజన గ్రామాల్లో పర్యటించి ఎంపీ అభ్యర్థి ఆత్రం సక్కును గెలిపించాలన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. కాంగ్రెస్, బీజేపీలు చేస్తున్న మోసాలను, ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో మండల యూత్ అధ్యక్షుడు పేరం శ్రీనివాస్, వైస్ ఎంపీపీ సుతారి వినయ్ కుమార్, కోప్షన్ సభ్యుడు మున్వర్ అలీ ఖాన్, జిల్లా అధికార ప్రతినిధి సిటీ మల్ల భరత్ కుమార్ పాల్గొన్నారు.

లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ గెలుపు ఖాయం

- మంచిర్యాల ఎమ్మెల్యే ప్రేంసాగర్ రావు

నవతెలంగాణ-లక్షెట్టిపేట



లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ గెలుపు కాయమని, పెద్దపెల్లి ఎంపీ అభ్యర్థి గడ్డం వంశీకృష్ణ తప్పక గెలుపొందుతున్నాడని ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్‌రావు అన్నారు. బుధవారం పట్టణంలోని మొదెల, ఉత్కూర్, ఇటిక్యాల, వార్డులలో ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. మే 13న జరగబోయే పెద్దపల్లి పార్లమెంట్ ఎన్నికల్లో చేతి గుర్తుకు ఓటు వేసి గడ్డం వంశీకష్ణను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. చేతి గుర్తుకు ఓటేసే బాధ్యత మీదని, పనిచేసే బాధ్యత కాంగ్రెస్ ప్రభుత్వానిదని అన్నారు. కార్యకర్తలు సైనికుల్ల పనిచేస్తూ కాంగ్రెస్ అభ్యర్థి గెలుపులో భాగం కావాలని సూచించారు. కేంద్రంలో బీజేపీ మళ్లీ అధికారంలోకి వస్తే రాజ్యాంగాన్ని మార్చేస్తుందని ఆరోపించారు. గత పదేళ్లలో బీజేపీ మతతత్వ రాజకీయం చేసి మతాల మధ్య చిచ్చుపెడుతోందని విమర్శించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఫోర్ లీడర్ చెల్ల నాగభూషణం, మండల అధ్యక్షుడు పింగళి రమేష్, పట్టణ అధ్యక్షుడు ఆరిఫ్, కొత్త వెంకటేశ్వర్లు, బియ్యాల తిరుపతి, నవాబ్ ఖాన్, దమ్ము నారాయణ పాల్గొన్నారు.

కేంద్రంలో కాంగ్రెస్ రావాలి

నవతెలంగాణ-జన్నారం

కేంద్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వస్తేనే బడుగు బలహీన వర్గాలు అభివృద్ధి చెందుతాయని కాంగ్రెస్ అధ్యక్షుడు ముజాఫర్ అలీ ఖాన్ సీనియర్ నాయకులు మిక్కిలినేని రాజశేఖర్ అన్నారు. బుధవారం మండలంలోని పొన్కల్ ధర్మారం గ్రామపంచాయతీలలో వేరువేరుగా ప్రచారం నిర్వహించారు. సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఆరు గ్యారెంటీ స్కీములను తప్పకుండా అమలు చేస్తుందన్నారు. కేంద్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వస్తే ప్రతి పేదవానికి న్యాయం జరుగుతుందన్నారు. కేంద్రంలో ఉన్న ప్రస్తుత బీజేపీ ప్రభుత్వం, పేదలకు న్యాయం చేయడంలో విఫలం చెందిందన్నారు. అలాంటి ప్రభుత్వాన్ని పారద్రోలాలన్నారు. రాహుల్ గాంధీని ప్రధాన మంత్రి చేయడానికి ప్రతి కార్యకర్త నాయకుడు కంకణ బద్ధులై పనిచేసి, ఆదిలాబాద్ ఎంపీ అభ్యర్థి ఆత్రం సుగుణను చేతి గుర్తుకు ఓటు వేసి గెలిపించాలన్నారు. కార్యక్రమంలో ధర్మారంమాజీ సర్పంచ్ దుర్గం గంగాధర్, దూమల్ల రమేష్, ముత్యం రాజన్న, లక్ష్మి నారాయణ, సుధీర్ పాల్గొన్నారు.

అకాల వర్షం.. రైతుకు నష్టం..!

- గాలిదుమారంతో దెబ్బతిన్న పంటలు
- నేల రాలిన మామిడి కాయలు
- పరిహారం ఇవ్వాలని రైతుల వేడుకోలు



నవతెలంగాణ-జైపూర్

ఆరుగాలం పండించిన పంట చేతుకు వచ్చే క్రమంలో మంగళవారం జిల్లాలో కురిసిన వర్షానికి అపార నష్టం మిగిల్చింది. గాలి దుమారంతో పాటు కురిసిన వడగళ్ల వనాకు కోత దశకు వచ్చిన వైరి పైరు నేలమట్టం అయింది. యాసంగిలో సాగు చేసిన పంటలు అతలాకుతలమయ్యాయి. ప్రధానంగా వరి, మామిడి పంటలకు తీవ్ర నష్టం వాటిల్లింది. జైపూర్ మండలలోని వివిధ ప్రాంతాల్లో వరి కోతలు పూర్తి కాగా మరి కొన్ని ప్రాంతాల్లో వరి పైరు కోతకు సిద్ధంగా ఉంది. చేతికందుతుందనుకున్న సమయంలో ప్రకృతి



వైపరిత్యానికి రైతులు తీవ్రంగా నష్టపోయారు. మండలంలో 366 మంది రైతులకు సంబంధించి 537 ఎకరాల్లో సాగు చేసిన వరి పంటకు నష్టం జరిగిందని అధికారులుఅంచనా వేస్తున్నారు. అదేవిధంగా భీమారం మండల పరిధిలో 50 మంది రైతులకు సంబంధించి సుమారుగా 90 ఎకరాల్లో సాగు చేసిన వరి పంటకు నష్టం జరిగినట్లు ప్రాథమికంగా నిర్ధారించారు. కిష్టాపూర్ నుంచి మొదలు శివ్వారం వరకు కురిసిన రాళ్లవానతో కొనుగోలు కేంద్రాల్లో నిల్వ చేసుకున్న వరి ధాన్యం తడిసిముద్దయ్యింది. అదేవిధంగా ఉమ్మడి జైపూర్ మండలంలో మామిడి పంట 35 నుండి 40 శాతం నష్టం జరిగి ఉడవచ్చని అధికారులు అంచనా వేస్తున్నారు. జైపూర్ మండల పరిధిలో 1896 ఎకరాల మామిడి తోటలతో పాటు భీమారం మండల పరిధిలో 2200 ఎకరాల్లో 50 శాతం మామిడి పంట చేతికందినట్లు అధికారులు భావిస్తున్నారు. అకాలవర్షంతో పాటు బలంగా వీచిన గాలులతో వేర్లతో సహా చెట్లు పడిపోగా కొమ్మలు విరిగి చెట్టుకు ఉన్న కాతలో 90 శాతం నేల రాలింది. పంట నష్టపోయిన రైతులు తమకు పంటనష్ట పరిహారం ఇవ్వాలని ప్రభుత్వాన్ని వేడుకుంటున్నారు.

రాలిందంతా పగిలింది



శ్రీనివాస్‌గౌడ్, రైతు శివ్వారం, జైపూర్.

రాళ్లవానతోపాటు గాలిదుమారంతో మామిడి పంట చేతికందకుండా పోయింది. చెట్టుకున్న 90 శాతం కాయ నేల రాలి పగిలి పోయింది. పశు గ్రాసానికి తప్పామార్కెట్‌కు తరలించే వీలులేకుండా ఉంది. ప్రతి సంవత్సరం కోత దశలో మామిడి పంటను నష్టపోవల్సి వస్తుంది. శివ్వారం, పౌనూర్, వేలాల గ్రామ శివారుల మీదుగా రాళ్లతో కూడిన వర్షంతో మామిడి, వరి పంటలను తీవ్రంగా నష్టపోవల్సి వచ్చింది. అధికారులు వెటనే సర్వే చేపట్టి నష్ట పరిహారం ఇచ్చే విదంగా చూడాలి.

సుమారు 40 శాతం మామిడి పంటకు నష్టం



తిరుపతి, ఉధ్యానవ శాఖ అధికారి.

ఉమ్మడి జైపూర్ మండలంలో కురిసిన అకాలవర్షంతో సాగులోని మామిడి పంట సుమారు 40 శాతం నష్టం వాటిలి ఉండవచ్చు. దాదాపుగా 50 శాతం మామిడి పంట చేతికందింది. మిగిఇ ఉన్న యాభై శాతంలో అత్యధికంగా పంటకు నష్టం జరిగినట్లు గుర్తించాం. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు పంటలకు జరిగిన నష్టాన్ని గుర్తించేందకు క్షేత్రస్థాయి నివేధికలు సిద్ధం చేస్తున్నాం.

నష్టం అంచనా వేస్తున్నాం

మార్క్‌గ్లాడ్సన్, వ్యవసాయ అధికారి

మంగళవారం కురిసిన వడగళ్ల వానతో పంటలకు జరిగిన నష్టాన్ని అంచనా వేస్తున్నాం. ప్రాథమికంగా సేకరించిన సమాచారాన్ని అధికారులకు నివేధించి ప్రభుత్వ నిర్ణయం మేరకు పూర్తి స్థాయిలో నివేధికలు తయారు చేయనున్నాం. ఆలస్యంగా సాగు చేసిన వరి పంటలకు నష్టం జరిగింది. ఉమ్మడి జైపూర్ మండలంలో 650 నుండి 700 ఎకరాల్లో సాగు చేసిన వరి పంటకు నష్టం జరిగినట్లు ప్రాథమికంగా తెలిసింది. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు వ్యక్తిగతంగా క్షేత్రస్థాయి రిపోర్టు తీసుకోవల్సి ఉంది.

ప్రతి ఏటా ఇదే గోస

సందెల తిరుపతి, రైతు ఆర్కెపల్లి, భీమారం

ప్రతి సంవత్సరం ప్రకృతి ప్రకోపానికి గురి కావల్సి వస్తోంది.. వర్షం పాక్షికంగా కురిసినా గాలి వేటు పంటలను అతలాకుతలం చేసింది. నలువైపుల నుండి బలంగా వీచ్చిన గాలిదుమారంతో ఇటు నుండి అటు నుండి వరి పైరు పడిపోయింది. పైరు కోయాలనుకున్నా హార్‌వేస్టర్ పంటికి అందేటట్టు లేదు..మనుషులతో కోపియ్యాలంటే ఖర్చులు అదనంగా భరించాల్సి వస్తుంది...నిలాటు పొలాన్ని గంటలో కోసే హార్‌వేస్టర్ పడిపోయిన పొలంలో రెండు గంటలు కోయాల్సి వస్తోంది. గాలివేటుకు పడిపోయిన పంట పొలంలో దిగుబడి శాతం తగ్గడమే కాకుండా హార్‌వేస్టర్ చార్జీలు అదనంగా నష్టపోవల్సి వస్తుంది.

గడ్డం వంశీకృష్ణను భారీ మెజార్టీతో గెలిపించండి



నవతెలంగాణ-నస్పూర్

సీపీఐ బలపరిచిన పెద్దపల్లి పార్లమెంట్ కాంగ్రెస్ అభ్యర్థి గడ్డం వంశీకృష్ణను భారీ మెజారిటీతో గెలిపించాలని సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్(ఏఐటీయూసీ) రాష్ట్ర అధ్యక్షుడు వాసిరెడ్డి సీతారామయ్య కార్మికులకు పిలుపునిచ్చారు. బుధవారం చెన్నూర్ ఎంఎల్ఏ గడ్డం వివేక్ వెంకటస్వామితో కలిసి శ్రీరాంపూర్ ఏరియాలోని ఆర్కె-6 గనిలో నిర్వహించిన గేట్ మీటింగ్‌లో మాట్లాడారు. కేంద్రంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం అవలంబిస్తున్న కార్మిక ప్రజా వ్యతిరేక విధానవల్ల దేశవ్యాప్తంగా ప్రజలు తీవ్రమైన ఇబ్బందులకు గురవుతున్నారని, లాభాల్లో ఉన్నటువంటి ప్రభుత్వ రంగ సంస్థలైన ఎల్ఐసీ, టెలిగ్రామ్, సింగరేణి వంటి ప్రభుత్వ రంగ సంస్థలను ప్రయివేటుపరం చేస్తుందని విమర్శించారు. కార్మికులను కట్టు బానిసలుగా చేసి 12 గంటల పని దినాన్ని అమలు చేసేందుకు ప్రయత్నాలు చేస్తున్నారని ఆరోపించారు. బీజేపీ ప్రభుత్వం పేదల కోసం ప్రజల కోసం కాకుండా పెట్టుబడిదారులైన ఆదాని, అంబానీల కోసం పని చేస్తున్నారని అన్నారు. గత పది సంవత్సరాలుగా రాష్ట్రంలో అధికారంలో ఉన్న బీఆర్ఎస్ రాష్ట్ర ప్రభుత్వం సింగరేణి సంస్థను లూటీ చేసిందని, కార్మికులకు ఏ విధంగా న్యాయం చేయలేదన్నారు. పైగా సింగరేణి సంస్థ మనుగడే ప్రశ్నార్థకంగా మార్చారని కనీసం సింగరేణి కార్మికులకు కోలిండియాలో అమలవుతున్న, సింగరేణి సంస్థలో అధికారులకు యాజమాన్యం చెల్లిస్తున్న పెర్క్స్ పై ఆదాయ పన్ను మినహాయింపు కూడా చేయలేని వారు ఇప్పుడు ఏ ముఖం పెట్టుకొని కార్మికులను ఓట్లు అడుగుతున్నారని వారు ఈ సందర్భంగా ప్రశ్నించారు. సింగరేణి కార్మికులకు ఇచ్చిన హామీ మేరకు ఎన్నికల అనంతరం కచ్చితంగా పెర్క్స్ పై ఐటి మినహాయింపు, సొంత ఇంటి పథకం అమలు, నూతన బొగ్గు బావులు తదితర సమస్యలను వెంటనే పరిష్కారం చేస్తామని, కాంగ్రెస్ అభ్యర్థి గడ్డం వంశీకష్ణ భారీ మెజార్టీతో గెలిపించాలని వివేక్ వెంకటస్వామి కార్మికులకు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ప్రధాన కార్యదర్శి కందికట్ల వీరభద్రయ్య, సీపీఐ పెద్దపల్లి జిల్లా కార్యదర్శి సదానందం, శ్రీరాంపూర్ బ్రాంచ్ కార్యదర్శి ఎస్‌కె బాజీ సైదా, బ్రాంచ్ సంయుక్త కార్యదర్శి రాచర్ల చంద్రమోహన్, గొర్రె నర్సయ్య, సంఘం సదానందం, అఫ్రోజ్ ఖాన్, మురళి చౌదరి, బిర రవీందర్, గునిగంటి నర్సింగరావు, కుమారస్వామి, రామ్ చందర్, బాలసాని లక్ష్మణ్, కారుకూరి నగేష్, మహేష్, అడ్డు శ్రీనివాస్ పాల్గొన్నారు.

బీజేపీ పాలనలో ప్రజాస్వామ్యం విధ్వంసం

నవతెలంగాణ-తాండూర్

బీజేపీ పాలనలో రాజ్యాంగం విధ్వంసం చేసేందుకు కట్ర జరుగుతోందని బెల్లంపల్లి సీపీఐ నాయకులు రేగుంట చంద్రశేఖర్ అన్నారు. బుధవారం తాండూర్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీజేపీకి మద్దతిస్తే రాజ్యాంగాన్ని విధ్వంసం చేసి ఎస్సీ, ఎస్టీ, మైనార్టీల రిజర్వేషన్లను తొలగిస్తారని తెలిపారు. బీజేపీ పాలనలో రైతు చట్టాల కోసం రైతులు ఉద్యమిస్తే వారిని ఇబ్బందులకు గురి చేశారని తెలిపారు. బీజేపీ ప్రభుత్వం రెండు కోట్ల ఉద్యోగలు ఇస్తామని వాగ్దానం చేసి యువతను మోసం చేసిందన్నారు. ఇండియా కూటమి మద్దతు ఇస్తున్న కాంగ్రెస్ అభ్యర్థి గడ్డం వంశీ కృష్ణకు ఓటు వేసి గెలిపించాలని కోరారు. ఈ సందర్భంగా బీజేపీ పాలనలో రాజకీయ విధ్వంసం పుస్తకాన్ని సీపీఐ నాయకులు విడుదల చేశారు. ఈ సమావేశంలో సీపీఐ జిల్లా కార్యదర్శి రామడుగు లక్ష్మణ్, ఈ సమావేశంలో మండల కార్యదర్శి బయ్య మొగిలి, సీపీఐ నాయకులు



పట్టి శంకర్, సముద్రాల ఆనంద్, మలిశెట్టి సత్యనారాయణ, వాసాల నాగరాజు, కామెర దుర్గయ్య, కామెర రమేష్, ఎడ్ల బాపు, కమ్మరి చంద్రయ్య పాల్గొన్నారు.

పట్టణంలో కాంగ్రెస్ విస్తృత ప్రచారం

నవతెలంగాణ-రామకృష్ణాపూర్

లోక్ సభ ఎన్నికల ప్రచారంలో భాగంగా పట్టణ కాంగ్రెస్ నాయకుల ఆధ్వర్యంలో బుధవారం ప్రచారంలో వేగం పెంచారు. స్థానిక బీజోన్ సెంటర్ వ్యాపార దుకాణాలతోపాటు పలు విధుల్లో కాంగ్రెస్ ప్రవేశ పెట్టిన గ్యారంటీ పథకాలు వివరిస్తూ ప్రచారం నిర్వహించారు. రానున్న లోక్ సభ ఎన్నికల్లో బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలను ఓడించి కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి గడ్డం వంశీని భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ జంగం కళ, పట్టణ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు గోపతి రాజయ్య, నాయకులు అబ్దుల్ అజీజ్ పాల్గొన్నారు.

మాదిగ హక్కుల దండోరా ఇంటింటా ప్రచారం



నవతెలంగాణ-నస్పూర్

మాదిగ హక్కుల దండోరా ఆధ్వర్యంలో నస్పూర్ పట్టణంలోని శ్యామ్ నగర్‌లో జిల్లా అధ్యక్షుడు కడారి రమేష్ మాదిగ, పట్టణ అధ్యక్షుడు అట్కపురం సమ్మయ్య మాదిగ బుధవారం ఇంటిటికి ప్రచారం నిర్వహించారు. కాంగ్రెస్ కేంద్రంలో అదికారంలోకి వస్తే పేదల కోసం ఏ పథకాలు తీసుకు వస్తుందో వివరించడంతో పాటు, మాదిగల హక్కుల విషయంలో చెన్నూర్ శాసనసభ్యులు డాక్టర్ వివేక్ వెంకటస్వామి స్పష్టమైన హామీ ఇచ్చిన నేపథ్యంలో కాంగ్రెస్‌కు మద్దతు ఇవ్వాలన్నారు. కాంగ్రెస్ అభ్యర్థి గడ్డం వంశీకృష్ణను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంఎస్ఎఫ్ నాయకులు కోండ్ర ఉదయ్, నాయకులు బొల్లి బాబన్న, శ్యాంనగర్ కమిటి సభ్యులు తుంగపిండి తిరుపతి, దామెర సామ్రాట్, పుల్మారి నాగేష్, నందూ, మేరుగు రమేష్, మడక పవన్ కుమార్, లింగంపల్లి రాజెందర్, రంజిత్ మాదిగ పాల్గొన్నారు.

తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేయాలి



నవతెలంగాణ-జన్నారం

మండలంలోని పలు గ్రామాల్లో మంగళవారం కురిసిన భారీ వర్షానికి కొనుగోలు కేంద్రాల్లో ఉన్న వరి ధాన్యం పూర్తిగా తడిచిపోయింది. ఆ ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేయాలని బీఆర్ఎస్ సీనియర్ నాయకులు తాళ్లపల్లి రాజేశ్వర్ అన్నారు. బుధవారం కొనుగోలు కేంద్రాల్లో తడిసిన ధాన్యాన్ని పరిశీలించారు. ఈ ఏడు అరకోరా పండిన యాసంగి పటకు రైతులు అధిక పెట్టుబడులు పెట్టి నష్టపోయారని తెలిపారు. పండిన ధాన్యం కనీసం పెట్టుబడి ఖర్చులకైనా ఆ పనికి వస్తుందేమోనని అనుకుంటే, ఇలా అకాల వర్షంతో ధాన్యం తడిసిపోయిందన్నారు. తడిసిన ధాన్యాన్ని కూడా, ప్రభుత్వం రైతుల వద్ద నుంచి కొనుగోలు చేయాలని డిమాండ్ చేస్తున్నామన్నారు.

కాంగ్రెస్‌కు ఎమ్మార్పీఎస్ మద్దతు



నవతెలంగాణ-తాండూర్

ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నాయకుల సూచనల మేరకు తాము కాంగ్రెస్ పెద్దపెల్లి ఎంపీ అభ్యర్థి గడ్డం వంశీకృష్ణకు మద్దతు తెలుపుతున్నట్లు ఎమ్మార్పీఎస్ మండల నాయకులు తెలిపారు. బుధవారం తాండూర్ ప్రెస్‌క్లబ్‌లో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నాయకులు తుంగ పిండి రాజేష్ కుమార్ మాట్లాడుతూ మూడు తరాలుగా మంచిర్యాల జిల్లా శ్రేయస్సు కోసం పాటుపడుతున్న కాకా వారసులు వంశీకృష్ణకు మద్దతు ఇస్తున్నట్లు ప్రకటించారు మతతత్వ పార్టీలకు ఎమ్మార్పీఎస్ దూరంగా ఉండాలని వారు సూచించారు. ఈ సమావేశంలో ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు కొంకటి రవీందర్, ఎమ్మార్పీఎస్ తాండూర్ మండల్ అధ్యక్షుడు మహంకాళి రంగయ్య, వర్కింగ్ ప్రెసిడెంట్ శనిగరపు రాజేశం, జిల్లా నాయకురాలు రాజేశ్వరి, నియోజకవర్గ ఇన్‌చార్జి పి రమేష్, నాయకులు సంఫీ సారయ్య, ఓడ్డేపల్లి చింటూ, కొల్లూరు శ్రీనివాస్, రావుల లక్ష్మయ్య, ఎరుకట్ల మల్లేష్ పాల్గొన్నారు.

చెరువు మట్టిని పొలాలకు తరలించాలి

నవతెలంగాణ-తాండూర్

ఉపాధి హామీ పని స్థలాల నుంచి తొలగించిన సారవంతమైన మట్టిని రైతుల పొలాలకు తరలించే విధంగా చర్యలు తీసుకోవాలని ఎంపీడీఓ శ్రీనివాస్ తెలిపారు. బుధవారం పంచాయితీ సెక్రటరీలు ఉపాధి హామీ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యవసాయ అధికారుల సహకారంతో రైతుల పంట పొలాలకు చెరువు మట్టిని తరలించాలని ఆయన సూచించారు. ఉపాధి హామీ కూలీల సంఖ్య పెరిగేందుకు కృషి చేయాలన్నారు. కూలీలకు దినసరి కూలీ రూ.300 చెల్లుబాటు అయ్యే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. కూలీ డబ్బులు సత్వరంగా చెల్లుబాటు అయ్యే విధంగా అధికారులు కృషి చేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీ ఓ సత్యనారాయణ, ఏపీఓ నందకుమార్, అధికారి సదానందం, ఇన్‌చార్జి ఈసీ రమేష్, టీఏ లక్ష్మి భార్గవ్ పాల్గొన్నారు.

మిస్సింగ్ కేసు నమోదు

నవతెలంగాణ-లక్షెట్టిపేట

పట్టణంలోని అంకతివాడకు చెందిన వేముల మహేష్(30) కనపడటం లేదని మిస్సింగ్ కేసు నమోదు చేసినట్లు లక్షెట్టిపేట ఎస్ఐ పి చంద్రకుమార్ తెలిపారు. మహేష్ మీసేవా ఉద్యోగిగా పనిచేస్తున్నాడు. భార్య రాధికకు సంతానం కాకపోవడంతో ఇటీవల చిన్నపాపను దత్తత తీసుకున్నారు. పాప ఆరోగ్యం బాగలేక తన భార్య వాళ్ళ అమ్మగారింటికి వెళ్ళింది. మహేష్ కూడా పాపని భార్యని చూసి వస్తున్నాడు. ఈ నెల 7న ఉదయం భార్యతో కాసేపు ఫోన్‌లో మాట్లాడి మీసేవకు వెళ్తున్నాని చెప్పాడు. సాయంత్రం వరకు ఫోన్ చేయలేదు ఇంటికి రాలేదని తెలిసింది. ఫోన్ కూడా స్విచ్ ఆఫ్ ఉండటంతో కుటుంబసభ్యులు, బంధువుల ఇండ్లలో ఆరాతీసి, చుట్టుప్రక్కల వెతికిన ఆచూకీ దొరకకపోవడంతో ఆయన మేనమామ పోలీస్టేషన్‌లో ఫిర్యాదు చేవారు.

నవతెలంగాణ
ఆదిలాబాద్
గురువారం | మే 09, 2024 | www.navatelangana.com

ప్రజలు నిర్భయంగా ఓటు వేయాలి

నవతెలంగాణ-ఇంద్రవెల్లి



త్వరలో జరిగే పార్లమెంట్ ఎన్నికల్లో ప్రజలు నిర్భయంగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని సీఐ మొగిలి ప్రజలను కోరారు. బుధవారం కేంద్ర పారా మిలటరీ బలగాలతో కలిసి మండల కేంద్రంలో కవాతు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారత రాజ్యాంగం 18 ఏండ్లు నిండిన ప్రతి పౌరుడికి ఓటు హక్కును కల్పించిందన్నారు. ప్రజలు ప్రశాంత వాతావరణంలో తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని కోరారు. కవాతులో ఎస్సై దుబ్బాక సునీల్, సిబ్బంది పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు చేయాలని రైతుల నిరసన

నవతెలంగాణ-లక్ష్మణచాంద



మండలంలోని చామన్‌పల్లి గ్రామంలో వరి ధాన్యం కొనుగోలు చేయాలని రైతులు బుధవారం రోడ్డుపై బైటాయించారు. వరి కోతలు కోసి రోజులు గడుస్తున్నా తగినన్ని గన్నీ బ్యాగులు అందివ్వట్లేదని, తూకం వేయడం లేదని తెలిపారు. కొనుగోలు చేసిన ధాన్యం తరలించట్లేదని వాపోయారు. విషయం తెలిసి ఎస్సై శ్రీకాంత్ సంఘటన స్థలానికి చేరుకొని తహసీల్దార్‌తో ఫోన్‌లో మాట్లాడారు. సివిల్ సప్లై అధికారులు రావడంతో నిరసన విరమించారు. పొట్టపెల్లి(కె)లోనూ గన్నీ బ్యాగులు ఇవ్వట్లేదని, ధాన్యం తూకం వేయడం లేదని రైతులు నిరసన వ్యక్తం చేశారు.

వ్యక్తిగా ప్రయత్నించు.. ప్రకృతి పరిమళించు..!

- అటవీ ప్రాంత ప్రజలకు అవగాహన కార్యక్రమాలు
- అగ్ని ప్రమాదాల నివారణ చర్యలు



అడవుల్లోకి అగ్ని రాకుండా గాలి పంపుతో నివారణ చర్యలు



ఫైర్ ప్రొటెక్షన్ పనులు పరిశీలిస్తున్న అధికారులు

నవతెలంగాణ-జైపూర్

అడవులు అభివృద్ధి చెందాలంటే విరివిరిగా చెట్లు నాటాలి. సహజ సిద్ధమైన అడవులను పరిరక్షించాలంటే అడవుల్లో అగ్ని ప్రమాదాలను నివారించాలి.. అగ్ని ప్రమాదాల నుండి అడవులను రక్షించుకోవడం కోసం వ్యక్తిగా ప్రయత్నిస్తే ప్రకృతి పరిమళాలను ఆస్వాధించవచ్చునని అటవీ అభివృద్ధి సంస్థ అధికారులు పేర్కొంటున్నారు. వేసవి కాలంలో ఏర్పడే అగ్ని ప్రమాదాల నుంచి అడవులను రక్షించుకోవడం కోసం తమ వంతు ప్రయత్నంగా గ్రామీణులకు అవగాహణ కల్పిస్తున్నారు. శాఖ పరంగా రక్షిత అటవీ ప్రాంతాల్లో అగ్ని ప్రమాదాలు జరుగకుండా చర్యలు చేపడుతూ అగ్ని ప్రమాదాల నివారించడం కోసం అటవీ సరిహద్దు గ్రామాల వారిని అప్రమత్తం చేస్తున్నారు. గత రెండు నెలలుగా ఉమ్మడి జైపూర్ మండలంలో పాటు కోటపల్లి, చెన్నూర్ మండలాల పరిధిలో అవగాహణ కార్యక్రమాలు చేపడుతున్న అటవీ అభివృద్ధి సంస్థ అధికారులు బీడీ, సిగరేట్ తాగి నిర్లక్ష్యంగా అటవీ ప్రాంతాల్లో పడవేయవద్దని హెచ్చరిస్తున్నారు. ప్రధానంగా పశుకాపరులు, బాటసారులు ఈ విషయంలో జాగ్రత్తలు పాటించాలని సూచిస్తున్నారు. రక్షిత అటవీ ప్రాంతంలో గల డీ గ్రేడ్ ఫారెస్ట్ ఏరియా (అటవీ పోరంబోకు భూములు) గుర్తించి అటవీ అభివృద్ధి సంస్థ అడవులను పెంచడం కోసం ప్లాంటేషన్లు ఏర్పాట్లు చేస్తుండగా అదే సమయంలో సహజసిద్ధంగా లభించిన అడవులను కాపాడుకోవడంపై మంచిర్యాల రేంజ్ అధికారులు దృష్టి సారించారు. మంచిర్యాల రేంజ్ అటవీ అభివృద్ధి సంస్థకు చెందిన ప్లాంటేషన్ మేనేజర్ గోగు సురేష్ కుమార్ ఆధ్వర్యంలో మండల పరిధిలో గల సరిహద్దు అటవీ ప్రాంత గ్రామాల వారితో సమావేశాలు ఏర్పాటు చేస్తూ అగ్ని ప్రమాదాల నివారణకు తీసుకోవల్సిన జాగ్రత్తలు వివరిస్తున్నారు. అదేవిధంగా సామాజిక బాధ్యతగా ప్రభుత్వ పాఠశాల విద్యార్థుల అవసరాలు తీర్చడం కోసం మధ్యాహ్న భోజనంకు సంబంధించి పేట్లు పంపిణీ చేయడం, కుర్చీలు, బెంచీలు పంపిణీ చేస్తూ గ్రామీణులకు దగ్గరవుతున్నారు.



రాత్రిపూట గస్తీ తిరుగుతున్న సిబ్బంది

అగ్ని ప్రమాదాలు జరగకుండా చర్యలు చేపడుతున్నాం

-గోగు సురేష్, టీఎస్‌డీసీ ప్లాంటేషన్ మేనేజర్



ఎండా కాలంలో ఏర్పడే అగ్ని ప్రమాదాలను నివారించడం కోసం ప్లాంటేషన్లలో రాత్రింబళ్లు సిబ్బందితో కలిసి గస్తీ తిరుగుతున్నాం. అగ్ని ప్రమాదాలు జరిగినప్పుడు మంటలు అడవుల్లోకి వ్యాప్తి చెందకుండా ప్లాంటేషన్ల చుట్టు ఫైర్ ప్రొటెక్షణ చేపట్టడం జరుగుతుంది. రక్షిత అటవీ ప్రాంతం మీదుగా ప్రయాణిస్తున్న వాహణదారులు, బాటసారులు, పశుకాపరులు జాగ్రత్త పడాలని హెచ్చరిస్తున్నాం. ఎక్కడ అగ్ని ప్రమాదం సంభవించినా వెంటనే తమకు సమాచారం అందించాలని గ్రామీణులను కోరుతున్నాం. ఈ విషయంలో గ్రామీణులకు అవగాహణ కల్పిస్తూ అగ్ని ప్రమాదాలను నివారించేందుకు అటవీ అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో అడవుల ప్రాముఖ్యతను వివరించడం జరుగుతుంది.

అకాల వర్షం..రైతులకు తీవ్ర నష్టం

- 1000 ఎకరాల్లో వరి, 250 ఎకరాల్లో మామిడికి నష్టం
- ఆదుకోవాలని రైతుల విజ్ఞప్తి



నవతెలంగాణ-ఆసిఫాబాద్

కడుపునిండా అన్నం పెట్టే రైతన్నకు అటు ప్రభుత్వం కానీ ఇటు వాతావరణం కానీ సహకరించకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికే ఆరుగాలం కష్టపడి పంట పండించినప్పటికీ పెట్టుబడి వెళ్తుందో లేదో అని ఆందోళనకు గురవుతున్న రైతన్నకు మంగళవారం జిల్లా వ్యాప్తంగా కురిసిన భారీ వర్షాలకు పెద్ద ఎత్తున పంట నష్టం వాటిల్లింది. దీంతో ఏం చేయాలో తోచని పరిస్థితుల్లో ఉన్నారు.

అకాల వర్షం రైతులకు తీవ్ర నష్టం

జిల్లాలో మంగళవారం కురిసిన అకాల వర్షానికి అపార నష్టం చోటుచేసుకుంది. జిల్లాలోని 15 మండలాల్లో యాసంగి పంట నష్టపోవడమే కాకుండా, ఉద్యానవన పంటైన మామిడి కూడా పెద్ద ఎత్తున రైతులు నష్టపోయారు. అనేకచోట్ల ఇండ్లపై రేకులు లేచిపోవడంతో పాటు పంట నష్టం కూడా భారీగానే జరిగింది.

1000 ఎకరాల్లో వరి, 250 ఎకరాల్లో మామిడి

మంగళవారం కురిసిన భారీ వర్షానికి జిల్లా వ్యాప్తంగా వ్యవసాయ అధికారుల ప్రాథమిక అంచనా ప్రకారం దాదాపు 200 మంది రైతులకు 1000 ఎకరాలకు పైగా యాసంగి వరి తో పాటు ఉద్యానవన పంటలైన మామిడి 250 ఎకరాల్లో నష్టపోయినట్లు గుర్తించారు. అయితే పూర్తి లెక్కింపు అయ్యేసరికి ఈ నష్టం ఇంకా పెరిగే అవకాశం ఉంది. ఇటు ప్రభుత్వాలు అటు వాతావరణం సహకరించకపోవడంతో రైతు పరిస్థితి వడకత్తెరలో పోక చెక్కల తయారైంది. అధికారులు పూర్తి స్థాయిలో సర్వేలు నిర్వహించి పంట నష్టం గురించి తెలుసుకోవాలని రైతులు కోరుతున్నారు.

ఆదుకోవాలని రైతుల విజ్ఞప్తి

చేతికి అందిన పంట వర్షం పాలు కావడంతో రైతులు తమ మొర ఎవరికి చెప్పుకోవాలని అర్థం కాక బాధపడుతున్నారు. ఇతర జిల్లాలతో పోలిస్తే జిల్లాలో యాసంగి సాగు కొంత తక్కువ అని చెప్పవచ్చు. అది కూడా ఇప్పుడు వర్షార్పనం కావడంతో రైతులు తలలు పట్టుకుంటున్నారు. తమను ఆదుకోవాలని కోరుతున్నారు.

ప్రభుత్వం ఆదుకోవాలి

ఉగేందర్, రైతు



మంగళవారం కురిసిన అకాల వర్షంతో వరి పంట మొత్తం వర్షార్పణమయింది. ఆరుగాలం కష్టపడి పండించిన పంట నష్టపోవడంతో ఏం చేయాలో తోచని పరిస్థితి తలెత్తింది. ప్రభుత్వం ఆదుకొని పంటకు నష్టపరిహారం చెల్లించాలి.

పంటను కొనుగోలు చేయాలి

మేకర్తి మాధవ్, బూరుగూడ రైతు.



ఎన్నో ఆశలతో కష్టపడి పంట పండిస్తున్నాం. ప్రస్తుతం కోతకు వచ్చింది. చేతికి వచ్చిందని అనుకున్న పంట వర్షంతో నష్టపోవాల్సి వచ్చింది. గింజ ముక్కిపోయే ప్రమాదం ఉంది. ప్రభుత్వం పంటను కొనుగోలు చేయాలి.

అత్యధిక మెజార్టీతో ఆత్రం సుగుణను గెలిపించాలి

- సీపీఐ(ఎం) నియోజకవర్గ కన్వీనర్ ఆనంద్‌కుమార్



బోదంపెల్లిలో ప్రచారం చేస్తున్న సీపీఐ(ఎం) నాయకుడు ఆనంద్‌కుమార్

నవతెలంగాణ-కౌటాల

ఈ నెల 13న జరగబోయే లోక్‌సభ ఎన్నికల్లో ఇండియా కూటమీ భాగస్వామి కాంగ్రెస్ అభ్యర్థి ఆత్రం సుగుణను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని సిర్పూర్ నియోజకవర్గ సీపీఐ(ఎం) కన్వీనర్ ఆనంద్‌కుమార్ బుధవారం మండల కేంద్రంతో పాటు ముత్తంపేట్, శివలింగాపూర్, బోదంపెల్లి గ్రామాల్లో చేతి గుర్తుకు ఓటు వేసి ఆత్రం సుగుణను గెలిపించాలని ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేద ప్రజల కోసం పేద ప్రజల పక్షాన, కార్మికుల, వ్యవసాయ కార్మిక కూలీల పక్షాన ఎర్రజెండా నిలుస్తుందన్నారు. కౌటాల మండలంలో భూపోరాటాలు చేసి సుమారుగా 1200 ఎకరాలు పేద ప్రజలకు పంచిన చరిత్ర సీపీఐ(ఎం)కు ఉందన్నారు. యూపీఏ ప్రభుత్వ హయాంలో ఉపాధిహామీ, అటవీ హక్కుల చట్టం, సమాచార, విద్య లాంటి ముఖ్యమైన చట్టాలను పోరాడి సాధించామన్నారు. ప్రస్తుత కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం ఆ చట్టాలను నిర్వీర్యం చేస్తుందని ఆరోపించారు. పది సంవత్సరాలు అధికారంలో ఉన్న బీజేపీ ఆకలి నుండి ఆనందం వరకు ఆంక్షలు విధిస్తుందన్నారు. మోడీ హయాంలో ఒక్క కొత్త ఆస్పత్రి ఏమైనా నిర్మించారా అని ప్రశ్నించారు. పైగా ప్రభుత్వ రంగ సంస్థలైన ఇండియన్ ఎయిర్ లైన్స్, ఇండియన్ రైల్వే, దేశ నవరత్న కంపెనీలను అమ్ముతున్నారని, ఎల్ఐసీని సైతం ప్రయివేటు పరం చేస్తుందని దుయ్యబట్టారు. మతం పేరుతో ఓట్లు అడుగుతున్న బీజేపీని ఓడించాలని, కాంగ్రెస్ అభ్యర్థి ఆత్రం సుగుణక్కను చేతి గుర్తుకు ఓటు వేసి భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఆయన వెంట సీపీఐ(ఎం) మండల నాయకులు మాల్కార్ ప్రభాకర్, దుర్గం రాజ్‌కుమార్, ముంజంకార్ శంకర్, జుమ్మె సంపత్, లక్ష్మీ విజయ, తులసీ పాల్గొన్నారు.

ఆత్రం సక్కును భారీ మెజార్టీతో గెలిపించాలి



నవతెలంగాణ-ఆదిలాబాద్ రూరల్

బీఆర్ఎస్ అభ్యర్థి ఆత్రం సక్కును భారీ మెజారిటీతో గెలిపించాలని బీఆర్ఎస్ నాయకులు కొత్తపల్లి సంతోష్ ఇంటింటికి తిరిగి ప్రచారం చేశారు. బుధవారం మండలంలోని తిప్ప, తిప్పకొలాంగూడ, మరేగాం, బోరింగూడ, హతిగుట్ట, కొలాంగూడ, ఖానాపూర్, చిచ్‌ధరి, అలికోరి గ్రామాల్లో ప్రచారం చేపట్టారు. కేంద్రంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం బడాబాబులకు అండగా ఉంటూ, నిరు పేదలను నిలువునా ముంచుతోందని పేర్కొన్నారు. మోడీ, ఈడీ, కేడీ తప్ప దేశ ప్రజలకు ఎలాంటి ఉపయోగం లేదని ప్రచారంలో ఓటర్లకు వివరించారు. కారు గుర్తుకు ఓటేసి ఆత్రం సక్కుని గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు కుమ్ర రాజు, గెడం రాము, గెడం లీలావతి, రాథోడ్ అంకుష్ పాల్గొన్నారు.

అనారోగ్యంతో మాజీ సర్పంచ్ మృతి

నవతెలంగాణ-నార్నూర్

మండలంలోని ఖంపూర్ గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ సలాం ఆనంద్‌రావ్ బుధవారం అనారోగ్యంతో మృతి చెందాడు. సర్పంచుల సంఘం రాష్ట్ర కార్యదర్శి బానోత్ గజానంద్ నాయక్ నివాళులు అర్పించి కుటుంబ సభ్యులను పరామర్శించారు. పరామర్శించిన వారిలో కాంగ్రెస్ నాయకులు దాదే అలీ, ఫ్యాక్స్ డైరెక్టర్ దుర్గే కాంతారావ్, ప్రకాష్, మహేందర్, అశోక్, అయ్యూబ్ ఉన్నారు.

పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్ గడువు పొడిగింపు

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఎన్నికల విధుల్లో పాల్గొంటున్న ఉద్యోగులు పోస్టల్ బ్యాలెట్ సదుపాయాన్ని వినియోగించుకునేందుకు ఎన్నికల కమిషన్ మరో రెండు రోజుల గడువు పెంచిందని రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ రాజర్షి షా బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ నెల 8 వరకు గడువు ఉండగా దాన్ని 10 వరకు పెంచినట్టు తెలిపారు. ఈ అవకాశాన్ని ఎన్నికల విధులు నిర్వహించే ఉద్యోగులు వినియోగించుకోవాలని సూచించారు. పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఏర్పాటు చేసిన ఓటర్ ఫెసిలిటేషన్ సెంటర్‌లో తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని పేర్కొన్నారు.

పాలిసెట్ దరఖాస్తుకు గడువు పొడిగింపు

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

పాలిటెక్నిక్‌లో ప్రవేశాల కోసం నిర్వహించే పాలిసెట్ ప్రవేశ పరీక్ష దరఖాస్తుకు ఆలస్య రుసుము రూ.100తో ఈ నెల 14 వరకు పొడగించినట్లు ఆదిలాబాద్ ప్రభుత్వ సంజయ్ గాంధీ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ భరద్వాజ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆసక్తిగల విద్యార్థులందరూ సత్వరమే తమ దరఖాస్తును నమోదు చేసుకోవాలని సూచించారు. మే 24న ప్రవేశ పరీక్ష ఉంటుందన్నారు. సాంకేతిక విద్య ద్వారా భవిష్యత్ బంగారు బాటలో నడుస్తుందని పేర్కొన్నారు. పదోతరగతి సిలబస్ ఆధారంగా మొత్తం 150 మార్కుల ప్రశ్నలు తెలుగు, ఆంగ్లంలో ఉంటాయని పేర్కొన్నారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

బీఆర్ఎస్‌లో భారీ చేరికలు



నవతెలంగాణ-ఆసిఫాబాద్

మండలంలోని ఈదులవాడ గ్రామ పంచాయితీ పరిధిలోని కాంగ్రెస్, బీజేపీకి చెందిన పలు కార్యకర్తలు మాజీ సర్పంచ్ బూసి భీమేష్ ఆధ్వర్యంలో బీఆర్ఎస్‌లో చేరారు. వీరికి ఎమ్మెల్యే కోవ లక్ష్మి కండువా కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామంలో గత ప్రభుత్వం చేసిన అభివృద్ధి పనులే తమను గెలిపిస్తాయని తెలిపారు. పార్టీలో తిరిగి చేరిన వారిలో తిరుపతి, గణేష్, మహేష్ ఉన్నారు. కార్యక్రమంలో నాయకులు సరస్వతి, మాజీ సర్పంచ్ భీమేష్, సిందెంకి మహేష్, సుధాకర్ పాల్గొన్నారు.

రాజ్యాంగ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత

- టీజేఎస్ రాష్ట్ర అధ్యక్షుడు కోదండరాం
- జిల్లా కేంద్రంలో రౌండ్ టేబుల్ సమావేశం



మాట్లాడుతున్న టీజేఎస్ రాష్ట్ర అధ్యక్షుడు కోదండరాం

నవతెలంగాణ-ఆసిఫాబాద్

రాజ్యాంగ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని తెలంగాణ జన సమితి రాష్ట్ర అధ్యక్షుడు కోదండరాం అన్నారు. జిల్లా కేంద్రంలోని రోజ్ గార్డెన్‌లో టీజేఎస్ ప్రజా సంఘాల ఆధ్వర్యంలో "ప్రమాదంలో ప్రజాస్వామ్యం పార్లమెంట్ ఎన్నికలు కర్తవ్యం" అనే అంశంపై రౌండ్ టేబుల్ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజ్యాంగం రాకముందు దేశంలో కులమతాల వారీగా ప్రజలు విడిపోయి బతికే వారన్నారు. రాజ్యాంగం వీరిని కలపడమే కాకుండా సమాజంలోని అన్ని వర్గాలను మనుషులుగా బతికేలా ఒక వేదికగా నిలిచిందన్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో భారత్‌లో అసమానతలు పెరిగాయన్నారు. అదాని, అంబానీల ఆస్తులు కోట్లలో పెరిగాయన్నారు. 10 సంవత్సరాల క్రితం లక్ష కోట్ల ఆస్తితో ఉన్న ఆదాని ప్రస్తుతం ఏడున్నర లక్షల కోట్లకు పెరిగాడని కానీ తిండి పెట్టే రైతు పరిస్థితి మాత్రం అలాగే ఉందన్నారు. వ్యవసాయంతో బతికే పరిస్థితి లేదని రైతులు వాపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కార్పొరేట్ వ్యవస్థను బతికించేలా ప్రభుత్వాలు పనిచేస్తున్నాయని ఆరోపించారు. వ్యవసాయం దండగ అని పట్టణాల్లో సెక్యూరిటీ గార్డ్ పనిచేయడం నయం అనే పరిస్థితి తలెత్తేల చేశారన్నారు. ఈ పరిస్థితి పోవాలంటే రాజ్యాంగ రక్షణ ఒకటే సాధ్యమన్నారు. ప్రస్తుతం దేశంలో ఉన్న పరిస్థితుల నేపథ్యంలో రాజ్యాంగ పరిరక్షణ కోసం చర్చించడం కాకుండా ప్రజల్లో దాని విలువలను పెంచేలా చేయాలన్నారు. రాజ్యాంగం కేంద్ర ప్రభుత్వ పాలనలో నిర్వీర్యం అయ్యే పరిస్థితి ఉందన్నారు. అలా కాకుండా చూడాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని తెలిపారు. వక్తలు మాట్లాడుతూ రాజ్యాంగ పరిరక్షణ కోసం ఇండియా కూటమికి ఓటు వేయాల్సిన అవసరముందన్నారు. కార్యక్రమంలో డీసీసీ అధ్యక్షుడు విశ్వప్రసాద్, టీజేఎస్ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు బాబన్న, వివిధ సంఘాల నాయకులు రూప్నర్ రమేశ్, దుర్గం దినకర్, కార్తీక్, ఆత్మకూరు చిరంజీవి, కోరంగ మాలశ్రీ, సోయం చిన్నన్న, ధర్మ, మారుతి పటేల్, చాంద్ పాషా, శ్యామ్, ఆసిఫ్, అసద్, వసంతరావు పాల్గొన్నారు.

రాజ్యాంగాన్ని రక్షించేది డీఎస్పీ మాత్రమే

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్



తెలంగాణ రాష్ట్రంలో భారత రాజ్యాంగ వ్యతిరేక శక్తులు ఒకవైపు, భారత రాజ్యాంగాన్ని రక్షించే పార్టీ ఒక వైపుగా ఉండి పోరాడుతున్నామని, భారత రాజ్యాంగాన్ని రక్షించేది దేశంలో డీఎస్పీ పార్టీ మాత్రమే అని ధర్మ సమాజ్ పార్టీ జిల్లా అధ్యక్షుడు అగ్గిమల్ల గణేష్ మహారాజ్ అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని ప్రెస్ క్లబ్‌లో విలేకరుల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారత రాజ్యాంగాన్ని మారుస్తామని అగ్రకుల పార్టీలు కాంగ్రెస్, బీజేపీ, టీఆర్ఎస్ ప్రత్యక్షంగా, పరోక్షంగా మాట్లాడుతున్నాయని తెలిపారు. ఏళ్లుగా అగ్రకుల పార్టీలు దోపిడీ చేస్తూ ప్రజలను పట్టించుకోలేదని, అందుకే అణగారిన వర్గాల పక్షాన ఆదిలాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ అభ్యర్థిగా మెస్రం గంగాదేవిని బరిలో ఉంచడం జరిగిందన్నారు. ఆదివాసీ బిడ్డను అందరూ ఆదరించి అమూల్యమైన ఓట్లు వేసి గెలిపించాలని కోరారు. ఈ నెల 10న ధర్మ సమాజ్ పార్టీ అధినేత డా. విశారదన్ మహారాజ్ రానున్నట్లు తెలిపారు. అభ్యర్థి మెస్రం గంగాదేవి ఎన్నికల ప్రచారంలో పాల్గొంటారని పేర్కొన్నారు. జిల్లా కేంద్రంలోని దస్నాపూర్ నుండి ఆర్అండ్‌బి గెస్ట్ హౌస్ వరకు ర్యాలీ ఉంటుందని, అనంతరం సభ ఉంటుందని తెలిపారు. బీసీ ఎస్సీ ఎస్టీలు కలిసి వచ్చి సభను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో అభ్యర్థి గంగాదేవి, నాయకులు బడుగు రాజేశ్వర్, తొంతికూరి సంతోష్, ధర్మాజీ, ఎనగంటి రవి, ప్రశాంత్, మెస్రం నారాయణ పాల్గొన్నారు.

పోలింగ్ ప్రక్రియ సజావుగా జరిగేలా చూడాలి



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఎన్నికల రోజు పోలింగ్ ప్రక్రియ సజావుగా, సునిశితంగా పరిశీలించడానికి మైక్రో అబ్జర్వర్లను నియమించడం జరిగిందని, పోలింగ్ ప్రక్రియను క్షేత్రస్థాయిలో క్షుణ్ణంగా పరిశీలించాలి సజావుగా జరిగేలా చూడలాని ఎన్నికల సాధారణ పరిశీలకులు రాజేంద్ర విజయ్ అన్నారు. బుధవారం జెడ్పి సమావేశ మందిరంలో ఎన్నికల విధులు నిర్వహించే మైక్రో అబ్జర్వర్స్ శిక్షణ కార్యక్రమాన్ని జిల్లా రిటర్నింగ్ అధికారి రాజర్షి షాతో కలిసి నిర్వహించారు. ఈ సందర్భంగా సాధారణ పరిశీలకులు మాట్లాడుతూ మాక్ పోల్ నిర్వహణ, తదనంతరం చేపట్టే పోలింగ్ ప్రక్రియ నిబంధనలకనుగుణంగా, పూర్తి పారదర్శకంగా జరుగుతున్నాయా లేదా అన్నది నిశిత పరిశీలన చేయాలని తెలిపారు. సీక్రెట్ పోలింగ్ కంపార్ట్మెంట్ ఏర్పాట్లు, ప్రతిది పరిశీలించాలని అన్నారు. ఎక్కడైన సాంకేతిక లోపాల వల్ల ఈవీఎంలు పనిచేయకపోతే వాటి స్థానంలో వేరే ఈవీఎంలు ఎలా అమరుస్తున్నారో పరిశీలన చేయాలని తెలిపారు. ఎలాంటి పొరపాట్లకు తావివ్వకుండా ప్రశాంత వాతావరణంలో పోలింగ్ జరిగేలా చూడాలని, మైక్రో అబ్జర్వర్స్ ఈ శిక్షణలో అన్ని అంశాలపై అవగాహన కల్పించుకొని పోలింగ్ ప్రక్రియను విజయవంతం చేయాలని కోరారు. అలాగే పోలింగ్‌కు సంబంధించిన నివేదికలను సకాలంలో ఎప్పటికప్పుడు పంపాలని తెలిపారు. మాక్ పోల్ ఉదయం 5.30కు ఏజెంట్ల సమక్షంలో నిర్వహించాలన్నారు. పోలింగ్ కేంద్రాల్లో ప్రిసైడింగ్, సహాయ ప్రిసైడింగ్ ఇతర అధికారులు నిర్వహిస్తున్న విధులు, టెండర్, ఛాలెంజ్ ఓటింగులు జరిగితే వాటి వివరాలను నమోదు చేసుకోవాలని సూచించారు.

పారదర్శకంగా ఎన్నికల ప్రక్రియ జరగాలి

ఈ సందర్భంగా రిటర్నింగ్ అధికారి మాట్లాడుతూ పార్లమెంటు పరిధిలోని మూడు అసెంబ్లీ సెగ్మెంట్లకు సంబంధించిన 190 మంది మైక్రో అబ్జర్వర్లకు అవగాహన కల్పించడం జరిగిందని తెలిపారు. పారదర్శకంగా ప్రశాంతమైన వాతావరణంలో ఎన్నికల ప్రక్రియ నడిచేలా మైక్రో అబ్జర్వర్లు క్షేత్రస్థాయిలో విధులు నిర్వహించాలన్నారు. అనెగ్జర్-28 ప్రకారం 18 అంశాలకు చెందిన వాటిపై ఎప్పటికప్పుడు నివేదికలు జనరల్ అబ్జర్వర్‌కు నేరుగా పంపాలని సూచించారు. పోలింగ్ కేంద్రాలలో అన్ని వసతులు ఉన్నాయా లేదా పరిశీలించాలని, పోలింగ్ రోజు ఎన్నికల కమిషన్ నిర్దేశించిన విధి విధానాలు అమలు అవుతున్నాయా లేదా పరిశీలించాలని తెలిపారు.